


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

## వైఎస్ఆర్ కడప

మంగళవారం 07 అక్టోబర్ 2025

పేజీలు - 08




# టిడ్కోపై అదే.. జాప్యం!

- గృహాల పంపిణీపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- నేడు..రేపు..అంటూ అదే సాగదీత దోరణి
- జిల్లాలో 2,226 గృహాలు పూర్తి.. వివిధ దశల్లో 2,600 గృహాల నిర్మాణం
- కడప, జమ్మలమడుగులతో గృహ సముదాయాల్లో మౌళిక వసతులు పూర్తి
- ప్రత్యేక చొరవ చూపుతున్న ఎమ్మెల్యేలు..

కడప బ్యూరో - మేజర్‌న్యూస్

టిడ్కో ఇళ్ళు ఊరిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వం రోజుకోక ప్రకటనతో కాలయాపన చేస్తోంది. అక్టోబర్ 2 నాటికి టిడ్కో ఇళ్ళ పంపిణీ పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా అడుగు కూడా ముందుకు వేయలేకపోయింది. పంపిణీపై స్పష్టత ఇవ్వలేకపోతోంది. జాప్యం జరుగుతూనే ఉంది. దీంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు సొంతింటి కల నిజం చేసుకోవాలని కళ్లు కాయలు కాసేలా ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణం, పంపిణీపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లను కూడా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. ఫలితంగా రూ.కోట్ల ప్రజాధనం వృధాగా పోయింది. అనాలోచితం నిర్ణయాలతో పూర్తయిన టిడ్కో గృహాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. అయితే తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారం లోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఏ మేరకు గృహాలు పూర్తయ్యాయి.. ఎక్కడెక్కడ పంపిణీకి అవకాశం ఉంది వంటి వాటిపై అధ్యయనం చేశారు. వాటిని వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లాలో 2,226 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు తెలుస్తోంది.

2లో

## జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం



**అత్యధికంగా కొండాపురంలో 93.2 మి.మీటర్ల నమోదు**

కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్

**వైఎస్సార్ కడప జిల్లాలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నదులు.. వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా మొత్తం 1250.0 మి.మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా కొండాపురంలో 93.2 మి.మీటర్ల వర్షం పడింది. దీంతో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి.**

అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ వర్షం కురుస్తోంది. సోమవారం తెల్లవారు జామున జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తారు వర్షం పడింది. మరో 24 గంటల్లో కూడా వర్షాలు పడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. జిల్లా మొత్తం 1250.0 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొండాపురంలో 93.2 మి.మీటర్లు కురిసింది. ముగిసిన ఖరీఫ్ సీజన్, ప్రారంభమైన రబీ సీజన్లకు సంబంధించి ఈనెల 6 నాటికి జిల్లాలో 450.4 మి.మీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా అందులో 383.5 మి.మీటర్ల వర్షపాతం కురిసినట్లు తెలుస్తోంది. అయితే ఇంకా 14.8 శాతం ...వార్త 3వ పేజీలో




# స్వచ్ఛతే అందరి లక్ష్యం!

**స్వచ్ఛ ఆంధ్రా పురస్కారాల్లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర - 2025 పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం**

**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్: స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్వచ్ఛ ఆంధ్రా పురస్కా రాలు. ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాయని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సభా భవన్‌లో "స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాలు - 2025" ప్రదా నోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు ప్రభుత్వ విప్, జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, జేసీ అదితిసింగ్, కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, జెడ్పి సీఈ వో ఓబులమ్మ హాజరై అవార్డులను ప్రదానం చేశారు.** ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. స్వచ్ఛ భార త్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ సాధ న కోసం అమలు చేస్తున్న "స్వచ్ఛ ఆంధ్రా -2025 పురస్కారాలు" ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపుతున్నాయన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 3వ శనివారం చేపడుతున్న స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించడం ద్వారా జిల్లాలోని ప్రతి గ్రామం స్వచ్ఛతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. దైనందిన మన జీవితంలో నిజమైన హీరోలు ఎవరంటే.. పారిశుధ్య కార్మికుల లే.. అని గర్వంగా చెప్పుకోవాలన్నారు. వారి సేవలు వెల కట్టలేని వని అభివర్ణించారు. స్వచ్ఛత వైపు ఒక ముందడుగు వేసి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ అవార్డుల ప్రదానం రాష్ట్రానికే కాదు, దేశానికి ఆదర్శనీయం అన్నారు. ముందుగా రెండు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న వారికి, 48 జిల్లా స్థాయి అవార్డులు అందు కున్న ప్రతి ఒక్కరికీ శుభాభివందనాలు తెలియజేస్తున్నామన్నారు. స్వచ్ఛ ఆలోచన అనేది మన ఇంటి నుండే ప్రారంభం కావాల న్నారు. ప్రతి పౌరుడు స్వచ్ఛ ఆంధ్ర సాధన వైపు అడుగులేసి ఆరో గ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. జిల్లా అం తట పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టంగా ..వార్త 2వ పేజీలో

## గండికోట ముంపు నిర్వాసితులకు న్యాయబద్ధమైన పరిహారం



**జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

**సమస్యలన్నింటికీ పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే ఆది**

2లో

## మడువంకతో రైతులకు కష్టాలు



6లో

# స్వచ్ఛతే అందరి లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)



నిర్వహించాలని, తడి పొడి చెత్తలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ వేస్ట్ ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉంటుందని... దాని పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. మన జిల్లాను ఆరోగ్య జిల్లాగా, కాలుష్య రహిత జిల్లాగా తీర్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. భారత దేశం అత్యంత వేగవంతమైన ఆర్థిక అభివృద్ధి రేటుతో ముందుకెళుతోందన్నారు. ఈ తరుణంలో మన చుట్టూ వున్న సమాజాన్ని శుచిగా ఉంచుకోవడంలో ఇంకా వెనుకబడి ఉన్నామని చెప్పుకునేందుకు వెనుకడుగు వేయాల్సి వస్తోందన్నారు. ఈ వ్యత్యాసాన్ని.. సమూలంగా మార్చేసి.. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛ సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ సంకల్పంతో ముందుకెళ్లాలన్నారు.

**స్వచ్ఛమైన వాతావరణంతో మంచి ఆలోచనలు..**

ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట పరిశుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా, మన జిల్లాను స్వచ్ఛమైన కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ స్వీయ స్వచ్ఛ తను పాటిస్తూ.. సమాజాన్ని కూడా స్వచ్ఛంగా ఆరోగ్యవంతంగా ఉంచేలా.. చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా స్వచ్ఛతకు మార్గదర్శకులు మహిళలే అని గుర్తు చేస్తూ.. స్వచ్ఛ సమాజాన్ని నిర్మించడంలో మహిళల పాత్ర కీలకమైనదని తెలిపారు.

**పరిశుభ్రత, పారిధ్యానికి పెద్దపీట...**

జేసీ అదితి సింగ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ అంతటా పరిశుభ్రత మరియు పారిశుధ్యాన్ని ప్రోత్సహించడంలో జిల్లాలు, సంస్థలు మరియు వాటాదారుల ఆదర్శప్రాయమైన ప్రయత్నాలను గుర్తించడానికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు -2025 అవార్డులు అందివ్వడం గర్వకారణం అన్నారు. వివిధ స్వచ్ఛత పరామితులలో పనితీరు మరియు ఇటీవలి స్వచ్ఛతా హీ సేవా ప్రచారం మరియు నెలవారీ స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం ఆధారంగా ఈ అవార్డుల ఎంపిక జరిగిందన్నారు. జిల్లా అంతటా స్వచ్ఛత హీ సేవ, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, సిబ్బంది, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు అందరికీ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ అవార్డులు జిల్లాలోని ప్రతి ఒక్కరికి స్ఫూర్తిని స్థాయని, భవిష్యత్తులో జిల్లాలోని అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీలు అవార్డులు అందుకుంటాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముందుగా అమరావతి నుండి "స్వచ్ఛ ఆంధ్రా -2025 అవార్డుల ప్రదానోత్సవం" కార్యక్రమాన్ని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడం జరిగింది. అనంతరం గౌరవ అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి.. జిల్లా అవార్డుల ప్రదానోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్.. పురస్కారాలకు ఎంపికైన వారిని అభినందిస్తూ.. వారి సేవలను అభినందిస్తూ అందరితో ఒక్క నిమిషం పాటు కరతాళ ధ్వనులతో కృతజ్ఞతాభివందనలు తెలియజేశారు. అనంతరం అవార్డులకు ఎంపికైన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమం లో అన్ని శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిష నర్లు, ప్రజారోగ్య శాఖల అధికారులు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా



# టిడ్కోపై అదే..జాప్యం!

(మొదటి పేజీ తరువాయి)

కడప జిల్లా పరిధిలో కడప, యర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు పట్టణ ప్రాంతాల్లో 4,848 టిడ్కో ఇళ్ల నిర్మాణాలను చేపట్టడమైంది. 300 స్క్వేర్ఫీట్, 365 స్క్వేర్ఫీట్, 430 స్క్వేర్ఫీట్ చొప్పున మూడు కేటగిరీలుగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. కడప నగర పరిధిలోని చిన్నచౌక్ పరిధిలోని ఎస్టేట్ ప్రాంతంలో 1,584 ఇళ్లు, అదేవిధంగా చలమారెడ్డి పల్లి ప్రాంతంలోని 1,440 ఇళ్లలో 992 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను ఇటీవలే కల్పించారు. చిన్నచిన్న పనులు మినహా మిగిలిన పనులు పూర్తయ్యాయి. యర్రగుంట్లలో 1440, జమ్మలమడుగులో 1440, ప్రొద్దుటూరులో 144 వెరసి 4,848 ఇళ్ల నిర్మాణాలను చేపట్టడమైంది. ఇందులో 2,226 ఇళ్లను పూర్తి చేయడమైంది. టీడీపీ గత ప్రభుత్వ సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ఇళ్లపంపిణీ, కేటాయింపు కార్యక్రమం ఆగిపోయింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి నాలుగేళ్లకు పైగా పూర్తయిన ఇళ్లను సైతం లబ్ధిదారులకు ఇవ్వలేదు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయలేదు. మరి కొన్ని చోట్ల అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో పలు చోట్ల పూర్తయిన పక్కా భవనాలు సైతం నిర్వహణ లేక పిచ్చిమొక్కలు మొలిచి పాడుపడ్డాయి. కడప వంటి ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారాయి. ప్రొద్దుటూరు పట్టణంలో 72 ఎకరాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణము చేపట్టారు. మొదటి దశలో 912 ప్లాట్లకు లబ్ధిదారులు తమ వాటా డబ్బులు దాదాపు రూ.1.18 కోట్లను చెల్లించారు. వైసీపీ ప్రభుత్వం రాగానే టిడ్కో ఇళ్లను రద్దుచేసింది. దీంతో నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పూర్తయిన ఇళ్లను తీసుకునేందుకు కూడా లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. అయితే మౌలిక వసతులు కల్పించకుండా పూర్తయిన అపార్ట్మెంట్లకు రంగులు వేసి మమ అనిపించారు. తాగునీరు, రోడ్లు తదితర కనీస వసతులు కూడా కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఆ ఇళ్లు మాకొద్దు అనే పరిస్థితికి తీసుకొచ్చారు. డిపాజిట్లు వెనక్కి ఇవ్వాలని పట్టు పట్టారు. కానీ గత ప్రభుత్వం పెద్దగా స్పందించలేదు. కానీ ఇటీవల తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితుల్లో స్పష్టమైన మార్పు కనిపించింది. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టిడ్కో గృహాల సముదాయ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల పంపిణీ చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా గృహాల పంపిణీపై అడుగులు ముందుకు పడటం లేదు.

**ఇప్పటికే రిజిస్ట్రేషన్ల పూర్తి..**

ఉమ్మడి కడప జిల్లాలో ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని 144 ఇళ్లు మినహా కడప, యర్రగుంట్ల, జమ్మలమడుగులో 300, 365, 430 కేటగిరీల ఇళ్లకు రిజిస్ట్రేషన్లను పూర్తి చేసినట్లు టిడ్కో అధికారులు చెబుతున్నారు. ఇందులో 300 స్క్వేర్ఫీట్ పరిమాణం కలిగిన ఇళ్లకు ఒక్క రూపాయితోనే రిజిస్ట్రేషన్ చేశారు. మిగిలిన రెండు రకాల ఇళ్ల లబ్ధిదారులు రూ.25 వేల చొప్పున లబ్ధిదారుని వాటా కింద చెల్లించడమైంది. అయితే టిడ్కో ఇళ్ల పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించాల్సి ఉంది. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, ఎస్ పి సరఫరా వంటి సమస్యలను పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రధానం. ఇందులో 75 శాతంపైగా పూర్తి చేయడమైంది. కడపలో ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి(వాసు), జమ్మలమడుగులో ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి ప్రత్యేక ప్రత్యేక చొరవ తీసుకుని మౌలిక వసతులు పూర్తి చేయిస్తున్నారు. దీంతో లబ్ధిదారుల్లో ఆశలు రేగుతున్నాయి. అయితే పూర్తయిన ఇళ్ళను పంపిణీ చేస్తామని గత నాలుగు నెలలుగా ప్రభుత్వం ఊరిస్తూనే ఉంది. నేడు..రేపు మభ్యపెడుతూనే ఉంది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి నారాయణ దీనిపై మరోసారి ప్రకటన చేస్తూ త్వరలోనే ఇళ్ళను లబ్ధిదారులకు అందాచేస్తామని చెప్పారు తప్ప పంపిణీపై స్పష్టత లేదు.

# గండికోట ముంపు నిర్వాసితులకు న్యాయబద్ధమైన పరిహారం

**కడప ప్రతినిధి - మేజర్న్యూస్:** గండికోట జలాశయ నిర్వాసిత గ్రామస్తులకు పునరావాసం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, న్యాయబద్ధమైన పరిహారం అందించేందుకు కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ నందు గండికోట జలాశయం ముంపు గ్రామస్తులకు పునరావాసం, పరిహారం, మౌలిక సదుపాయాలు కల్పించే అంశమై.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జేసీ అదితిసింగ్, ఆర్డీవో సాయిశ్రీ, ఎస్డీసిలు శాంతమ్మ, నీలమయ్యలతో కలిసి గ్రామస్తులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గండికోట రిజర్వాయర్లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేసి జిల్లాను సస్యశ్యామలం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో అన్ని రకాల నీటి అవసరాలను తీర్చే దిశగా ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా నీటి నిల్వ సామర్థ్యం పెంపుదల విషయంలో మరికొన్ని గ్రామాలు ముంపునకు గురి కావడంతో.. ఆయా గ్రామస్తులకు కూడా పరిహారం, పునరావాసం కల్పించడంలో భాగంగా వివిధ దశల్లో పరిహారం, పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి నివాస గృహాలను లబ్ధిదారులకు వారి పేరుతో ధృవీకరణ, రిజిస్ట్రేషన్ చేయించి అందించేందుకు తక్షణమే చర్యలు చేపడుతామన్నారు. గండికోట నిర్వాసిత గ్రామస్తులకు పునరావాసం, పరిహారం కల్పన విషయంలో.. 2019, 2023 వరకు కూడా చాలా వరకు పరిహారం అందించడం జరిగిందని, కొండాపురం మండలంలోని ఇంకా 3 గ్రామాలకు పరిహారం అందాల్సి ఉందన్నారు. మొత్తం 22 గ్రామాల వరకు ముంపునకు గురయ్యాయని, వారందరికీ పరిహారం, పునరావాసం కూడా కల్పించడం జరిగిందన్నారు. మొత్తం 26 పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. పునరావాసం కల్పించడంలో కొన్ని అంశాలు ఇంకా పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకారం అందాల్సిన పరిహారం నిధులు, పునరావాస కల్పనలో భాగంగా పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం లో పూర్తి స్థాయిలో పనులను చేపట్టాల్సి ఉందన్నారు. అంతే కాకుండా సామాజిక, ఆర్థిక సర్వే విషయంలో కూడా పూర్తిస్థాయిలో వివరాలు అందాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గండికోట పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

**ప్రభుత్వం అండగా ఉంటుంది...**

జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. అంతేకాకుండా గండికోట రిజర్వాయర్ కోసం భూములు, ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లపుడు వెన్నంటే ఉంటుందన్నారు. పునరావాస కాలనీల్లో అన్నిరకాల మెరుగైన మౌలిక వసతులు కల్పించడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో విస్తృతమైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందేలా ప్రాజెక్టులు రానున్నాయన్నారు. అనంతరం ముంపు గ్రామాలకు సంబంధించిన సమస్యలపై ఆయా గ్రామస్తుల నుండి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు అర్జీలను స్వీకరించారు. ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి పునరావాస గ్రామంలో స్మశానవాటిక లేక నానా అవస్థలు పడుతున్నామని పలువురు తెలిపారు. కొండాపురం మండలంలో పాఠశాల, జూనియర్ కళాశాలకు స్థలం, భవనాల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాల్ కలెక్టర్ను కోరారు. అలాగే దత్తాపురం పునరావాస గ్రామంలో చాలా స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని.. ప్రభుత్వ స్థలాలను పరి రక్షించాలని, ఆలయాలను పునర్నించాలని, కొంతమందికి పరిహారం పంపిణీ కూడా పెండింగ్లో ఉందన్నారు. ఈ సందర్భంగా ఫేస్-1, ఫేస్.2, ఫేస్ -3, ఫేస్ -4 కింద పునరావాసం కల్పించిన గ్రామాల్లో పెండింగ్ లోవున్న ప్యాకేజీ సమస్యను పరిష్కరించాలని పలువురు నిర్వాసిత గ్రామస్తులు వివిధ రకాల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్ ఆర్ అండ్ బి, పీఆర్, హౌసింగ్ సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన పడొద్దు... అండగా ఉంటా...

## వైఎస్ఆర్సిపి కార్యకర్తలకు ఎంపీ భరోసా

**పులివెందుల, మేజర్న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శ్రేణులు కూటమి ప్రభుత్వం నాయకులు చేస్తున్న అరాచకాలకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి కార్యకర్తలకు నాయకులకు వైసిపి పార్టీ అండగా నిలుస్తుందని ప్రజాదర్బార్లో ఎంపీ అవినాష్ రెడ్డి పేర్కొంటూ భరోసా నింపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పులివెందుల జగన్ క్యాంప్ కార్యాలయానికి వచ్చిన పలువురు నాయకులతో కార్యకర్తలతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ కొన్నింటిని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే వ్యతిరేకత మొదలైంది అన్నారు. 2029లో జరగనున్న ఎన్నికల్లో మన వైయస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పథకాల అమలులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేకెత్తించడంతో తల్లికి వందనం, ఉచిత బస్సు ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల్లో ప్రభుత్వం అమలు పరచడం మర్చిపోయి వైయస్సార్సీపి శ్రేణులు నాయకులను ఇబ్బందులకు గురిచేసి అక్రమ కేసులు బనాయించి పైసాచికానందాన్ని పొందుతుంది అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా కార్యకర్తలు నాయకులు భయపడే ప్రసక్తే లేదని వైయస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలియజేశారు. ఇకనైనా కూటమి నేతలు బుద్ధి మార్చుకుని ప్రజలకు మేలు చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీస్, నియోజకవర్గ వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# చిత్తశుద్ధికి నిదర్శనం తెలుగుదేశం పార్టీ

### వైకాపా నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

### ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి





**పులివెందుల, మేజర్‌న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని మధ్యాంధ్రప్రదేశ్గా మార్చారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత రెండు రోజులకు అన్నమయ్య జిల్లా మొలకలచెరువు గ్రామంలో నకిలీ మద్యం తయారు చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన తెలుగుదేశం పార్టీ నాయకులు నియోజకవర్గ బాధ్యులు జయ చంద్ర రెడ్డి,సురేంద్ర నాయుడు లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. ఈ సంఘటన తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఈ సంఘటన గురించి వైయస్ జగన్మోహన్ రెడ్డి, వైకాపా నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు నకిలీ మద్యం తయారుచేసి వందల కోట్లు కుంభకోణం జరిపిస్తున్నారు అనడం అవాస్తవమన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో వైకాపా నాయకులు లక్షల కోట్ల మద్యం స్కామ్ లో జైలు జీవితం గడుపుతున్నారని ఆయన గుర్తు చేశారు. జగన్ కి చిత్తశుద్ధి ఉంటే మద్యం స్కంలో పాల్పడిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో వైకాపా నాయకులు మద్యాన్ని తయారుచేసి విచ్చలవిడిగా విక్రయించారని, అలాంటి నకిలీ మద్యం సేవించిన ఎంతోమంది రోగాల బారిన పడ్డారన్నారు. అంత జరిగిన వైయస్ జగన్మోహన్ రెడ్డి వైకాపా నాయకులు సిగ్గులేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని అతి తక్కువ ధరకే విక్రయిస్తున్నామని, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా విక్రయించిన నకిలీ మద్యాన్ని తయారు చేసిన ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తే అలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. నకిలీ మద్యం తయారు చేశారు అనే తెలుగుదేశం పార్టీ నాయకులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.ఇప్పటికైనా వైయస్ జగన్మోహన్ రెడ్డి వైకాపా నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల బాధలు అధికారులకు కనిపించవా?



**కలసపాడు, మేజర్‌న్యూస్:** కలసపాడు మండలంలోని పశుసంవర్ధక శాఖ ఆసుపత్రికి వెళ్లాలంటే వర్షపు నీటితో నిండిన మురికి నీటిలో వెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు బురదమయంగా మారి చెరువును తలపిస్తుందని వారన్నారు. మూగజీవాలను తీసుకువెళ్లాలంటే ఆ బురదలోనే వెళ్లాల్సి వస్తుంది. ఈ విషయం సంబంధించిన అధికారుల స్పందించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరారు.

## వ్యవసాయ విస్తరణాధికారిగా నీలం రామచరణ్



**దువ్వూరు, మేజర్‌న్యూస్:** వ్యవసాయ విస్తరణ అధికారిగా పదోన్నతి పొందిన రామచరణ్, దువ్వూరు సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకుడిగా విధులు నిర్వర్తిస్తున్న నీలం రామ్ చరణ్ వ్యవసాయ విస్తరణ అధికారిగా దువ్వూరు మండలంలోని మాచనపల్లె క్లస్టర్‌కి పదోన్నతి పై రావడం జరిగింది. ఈ సందర్భంగా రామచరణ్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పరంగా రైతులకు ఏ అవసరం ఉన్న ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించడానికి కృషి చేస్తానని చెప్పారు. రామచరణ్ కు పదోన్నతి రావడం పట్ల పలువురు వ్యవసాయ అధికారులు, రైతులు అభినందనలు తెలిపారు.

# 25 శాతం రాయితీతో రైతులకు శనగలు

### మండలానికి 840 క్వింటాళ్ల శనగలు

**ముద్దనూరు, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం రాయితీతో రైతులకు శనగలను అందివ్వడం జరుగుతుందని ముద్దనూరు వ్యవసాయ అధికారి మారేడి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ముద్దనూరు మండలంలో శనగ పంట సాగు చేసే రైతు సోదరులకు రబీ సీజన్ కు గాను మండలానికి 840 కింటాల్స్ శనగలు మంజూరు అయ్యాయని వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగలు ఒక క్వింటాల్ పూర్తి ధర రూ. 7800లు కాగా, రాయితీ రూ. 1950లు పోను రైతు వాటా రూ. 5850లు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం రాయితీతో రైతులకు శనగలను పంపిణీ చేయుటకు విధి విధానాలను రూపొందించి నట్లు తెలిపారు. ఒక రైతుకు కనిష్ఠముగా 20 కిలోలు చొప్పున, గరిష్టంగా 200 కిలోలు చొప్పున, విస్తీర్ణంను బట్టి శనగలను పంపిణీ చేస్తామని, ఒకొక్క ప్యాకెట్ 20 కిలోలు బరువు ఉంటుంది అన్నారు. రైతు సోదరులు కావాల్సిన వారు పట్టాదారు పాసు పుస్తకం ,ఆధార్ కార్డ్ తీసుకుని రైతు సేవా కేంద్రములో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులు తప్పనిసరిగా విత్తనాలు తీసుకుని పంట సాగు చేయాలన్నారు. రాయితీ శనగలను దుర్వినియోగం చేయకూడదన్నారు.త్వరలోనే శనగ విత్తన పంపిణీ రిజిస్ట్రేషన్ తేదీలను ఖరారు చేస్తామని వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి వివరించారు.

## రాష్ట్ర వైఎస్ఆర్సిపి టియుసి ప్రధాన కార్యదర్శిగా కోగటం వీరారెడ్డి



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వైఎస్ఆర్సిపి టియుసి జనరల్ సెక్రటరీగా నియమితులైన వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకులు కోగటం వీరారెడ్డి. దువ్వూరు మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన వీరారెడ్డి, ప్రస్తుతం గ్రామ సర్పంచ్ గా వున్నారు, గతంలో జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజర్ సెక్రెటరీగా పని చేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వైఎస్ఆర్సిపి టియుసి ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డికి, మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లె రఘురామిరెడ్డికి ఇతర జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో జిల్లాలో బలోపేతం చేసి, 2029లో వైకాపా పార్టీని అధికారంలోకి రావడం లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.

## కర్ణపాపై పల్లె సమీపంలో ఆటో - ద్విచక్ర వాహనం ఢీ



**లింగాల, మేజర్‌న్యూస్:** లింగాల మండలంలోని కర్ణపాపయపల్లె సమీపంలో ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళ్తే తిమ్మంపల్లి గ్రామానికి చెందిన కేతిరెడ్డి యోగానంద రెడ్డి (22), అబ్దుల్ కులాయప్ప, వీరిద్దరూ తిమ్మంపల్లి నుండి పులివెందులకు వ్యక్తులకు కేతిరెడ్డి వెళుతుండగా పులివెందుల నుండి వెలిగండ్లకు ఆటో వస్తుండగా కర్ణపాపయపల్లి గ్రామం వద్ద ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొట్టగా ఆటోలు ఉన్న వ్యక్తులకు కేతిరెడ్డి యోగానంద రెడ్డి, అబ్దుల్ కులాయప్పను ఇరువురిని పులివెందులకు హుటాహుటెన హాస్పిటల్‌కు తరలించారు. డాక్టర్ల సమాచారం మేరకు యోగానంద రెడ్డికి జై ఫ్యాక్చర్ అయినట్టు, అలాగే అబ్దుల్ కులాయప్పకు కాలు పేక్షరైనట్టు వైద్యులు తెలిపారు. ఆటో వ్యక్తి పరారైనట్టు వారు తెలిపారు.

## ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి పెట్టండి



**కడప క్రైమ్, మేజర్‌న్యూస్:** కడప జిల్లా పోలీస్ కార్యాల యంలో సోమవారం జరిగిన "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా ఎస్.పి నచికేత్ విశ్వనాథ్ పాల్గొని, జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు , మహిళా పి.ఎస్ డి.ఎస్.పి ఇ.బాలస్వామి రెడ్డి పాల్గొన్నారు.

# కొత్తపల్లె పంచాయతీ అభివృద్ధి వైసీపీ హయాంలో మాత్రమే జరిగింది

### ఎంపిపి శేఖర్ యాదవ్



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** కొత్తపల్లె పంచాయతీ అభివృద్ధి వైసీపీ హయాంలో మాత్రమే జరిగిందని ఎంపిపి శేఖర్ యాదవ్ స్పష్టం చేసారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం లోని ఛైర్మన్ చాంబర్ లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తాను సర్పంచిగా కొత్తపల్లె పంచాయతీని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేశానని, బృందావనంగా మార్చాని చెబుతారని కానీ పంచాయతీలో జరిగిన అభివృద్ధి అమృత నగర్, వివేకానంద నగర్, ప్రకాష్ నగర్, తదితర ప్రాంతాల్లో తమ వైసీపీ పార్టీ పాలనలో జరిగినదే తప్పా శివ చంద్రారెడ్డి చేసినదేమీ లేదని, కేవలం ఆయన మాత్రం బాగా అభివృద్ధి చెందారని విమర్శించారు. మైదుకూరు రోడ్డు విస్తరణ చేసి కాల్వలు సరైన ప్రణాళిక లేకుండా నిర్మించారని, దీని వలన రోడ్ల పైనే మురుగు నీరు, వర్షం నీరు పారుతోందని విమర్శించారు. రోడ్డు విస్తరణ లో ఆయనకు సహకరించిన వారి విషయంలో ఒకలా, సహకరించని వారి విషయంలో మరోలా వ్యవహరించారని విమర్శలు వున్నాయన్నారు. తానే శివచంద్రారెడ్డికి కొత్తపల్లె పంచాయతీ పరిధిలో 50 సమస్యలు చెబుతానన్నారు. కనీసం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా వున్న రూముల తొలగింపులో నిజాయితీ నిరూపించుకోవాలని సూచించారు. పబ్లిసిటీ గురించి వదిలి శివ చంద్రారెడ్డి ప్రజా సేవలో వుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థ, రైతు పరిస్థితి దయనీయం

### శాంతి భద్రతల పరిస్థితి అధ్వానం : డా.ఎన్ తులసిరెడ్డి



**వేంపల్లె మేజర్‌న్యూస్:** టిడిపి కూటమి పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, రైతుల పరిస్థితి చాలా దయనీయంగా, శాంతి భద్రతలు అధ్వానంగా మారాయని ఏపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్ తులసిరెడ్డి ధ్వజమెత్తారు. గత వైకాపా ప్రభు త్వం ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల, అరా చక, మద్య, గంజాయి, డ్రగ్ ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిందన్నారు. ప్రస్తుత కూటమి పా లనలో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందన్నారు. ఇప్పటికైనా ఆయా రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ సారించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

# జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం

(మొదటి పేజీ తరువాయి)

వర్షపాతం లోటు ఉంది. సోమవారం తెల్లవారుజామున జిల్లాలో సారాసరిన 34.7 మి.మీటర్లుతో 1250.0 మి.మీటర్ల వర్షపాతం కురిసింది. ఇందులో అత్యధికంగా అత్యధికంగా కొండాపురంలో 93.2 మి.మీటర్ల వర్షపాతం కురిసింది. ఇతర మండలాలను పరిశీలిస్తే.. మైలవరం 28.6, పెద్దముడియం 23.4, రాజుపాలెం 17.2, దువ్వూరు 47.8, మైదుకూరు 36.8, బ్రహ్మంగారిమట్టం 66.2, శ్రీ అవధూత కాశినాయన 2.4, కలసపాడు 12.6, పోరుమామిళ్ల 0.0, బి.కోడూరు 4.8, బద్వేల్ 92.4, గోపవరం 70.0, ఖాజీపేట 7.0, చాపాడు 45.8, ప్రొద్దుటూరు 44.6, జమ్మలమడుగు 14.6, ముద్దనూరు 41.4, సింహా ద్రిపురం 18.8, లింగాల 17.2, పులివెందుల 8, వేముల 38.0, తొండూరు 30.4, వీరపునాయునిపల్లె 31.6, యర్రగుంట్ల 43.0 మి.మీ టర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా కమలాపురం 8.2, వల్లూరు 13.6, చెన్నూరు 47.8, అట్లూరు 36.8, ఒంటిమిట్ట 0.0, సిద్దవటం 26.8, కడప 60.8, చింతకొమ్మదిన్నె 35.4, పెండ్లిమర్రి 68.4, వేంపల్లి 37.2, చక్రాయపేట 83.2 మి.మీటర్లు కలిపి జిల్లా మొత్తం 1250.0 మి.మీటర్ల వర్షం కురిసింది. దీంతో జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నదులు..వాగులు..వంకల్లోకి..పంట పొలాల్లోకి వరదనీరు చేరింది. గ్రామాల్లోకి కూడా పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచిపో యింది. మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

# ఓపి టికెట్ల గోల: డిజిటల్ వ్యవస్థ ముసలి వాళ్ళకు మిగిల్చిన బాధ

**రిమ్స్ కడప మేజర్‌న్యూస్ :** కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సర్వజన వైద్యశాలలో రోగులకు ఓపి (ఔట్ పేషెంట్) టికెట్లు పొందడంలో ఎదురవుతున్న అవాంతరాలు తీవ్ర సమస్యగా మారాయి. ముఖ్యంగా ముసలి వయస్సు ఉన్న రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యుని సేవలను పొందాలంటే ముందుగా ఓపి టికెట్ అవసరం. అయితే ఈ టికెట్ పొందాలంటే ఆధార్ నంబర్‌తో లింక్ అయిన మొబైల్ ఫోన్‌కు ఓటీపీ రావాలి. ఆ ఓటీపీని నమోదు చేసిన తరువాతే టికెట్ జారీ అవుతుంది. ఈ ప్రక్రియను చదువుకున్నవారు ఏదో విధంగా చక్కదిద్దుకుంటున్నప్పటికీ, పాతతరం వారికి ఇది పెద్ద సమస్యగా మారింది. ఓటీపీ ప్రాసెస్ తెలియక, లేదా మొబైల్ ఫోన్ లేకుండా వచ్చిన ముసలి వారు టికెట్ పొందలేక వైద్యుడిని కలుసుకోలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీంతో వారి అసలు అనారోగ్యానికి తోడు ఇంకొక సమస్య తలెత్తుతోంది. ఆసుపత్రి ఆవరణలోనే పడి కాలు, చెయ్యి విరిగిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని అక్కడి వారు చెబుతున్నారు. “పాత రోజుల్లో ఆసుపత్రికి వెళ్ళగానే ఒక వాలంటీర్ రాసిచ్చేవాడు. ఇప్పుడు ఆ వయసులో మనల్ని ఓటీపీలు అడుగుతున్నారు. మాకు అర్థం కావడం లేదు. ఎవరు సాయపడతారో కూడా తెలియట్లేదు” అని ఓ వృద్ధురాలు




వాపోయింది. ఇలాంటి సమస్యలపై వెంటనే స్పందించి, మానవీయతను దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముసలి వారికోసం ప్రత్యేక కౌంటర్లు, మానవ సహాయకులు వంటి ఏర్పాట్లు చేస్తే వీరికి కొంత ఊరట లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## సాంఘిక సంక్షేమ శాఖ పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్సీ హామీ



**పులివెందుల మేజర్‌న్యూస్ :** సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు సోమవారం శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి ని కలిసి తమ ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు .పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు ముఖ్యంగా తమ సర్వీసును పార్ట్‌టైమ్ నుండి కాంట్రాక్ట్‌గా మార్చాలని పార్ట్ టైం టు కాంటాక్ట్. కాంటాక్ట్ కన్వర్షన్ , అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా తమ జీతాలను గణనీయంగా పెంచాలని కోరుతూ తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్సీ గారికి సమర్పించారు. దీర్ఘకాలంగా పరిష్కారం కాని తమ సమస్యల కారణంగా తాము ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను, వారు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. ఉపాధ్యాయులు వివరించిన సమస్యల న్నింటినీ రాంగోపాల్ రెడ్డి సావధానంగా విన్నారు. సామాజిక సంక్షేమ రంగంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల సమస్యలు న్యాయబద్ధమైనవని అంగీకరించి, ఈ సమస్యల పరిష్కారం కోసం తక్షణమే సంబంధిత మంత్రి దృష్టికి ఈ అంశాలను తీసుకువెళ్తానని, త్వరలో పరిష్కారమయ్యేలా తనవంతు కృషి చేస్తానని ఉపాధ్యాయులకు భరోసా ఇచ్చారు.

## మద్దతు ధరకు వరి ధాన్యం కొనుగోలు చేయాలి

**– మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి**

**– వ్యవసాయ అధికారికీ వినతిపత్రం**



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** రైతు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వ్యవసాయ అధికారి శివశంకర్ రెడ్డిని కలిసి ఆయా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం ప్రభుత్వ మద్దతు ధర రూ. 2369 ఉందని, అయితే దళారులు 81 కేజీల వరి ధాన్యం బస్తాను కేవలం రూ.1340 లకు కొనుగోలు చేస్తున్నారన్నారు. వీటిని నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వరి ధాన్యాన్ని ప్రభుత్వం సివిల్ సప్లయ్ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. ఒకవైపు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్నారని, మరోవైపు దళారుల దోపిడికీ గురై తీవ్రంగా నష్టపోతున్నారని వెల్లడించారు. అలిరెడ్డిపల్లి, తువ్వపల్లి, ఇడుపుల పాయ, వీరన్నగట్టుపల్లి, కుమ్మరాంపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలపై జిల్లా వ్యవసాయ, సివిల్ సప్లయ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని స్థానిక వ్యవసాయ అధికారికీ వినతిపత్రం ద్వారా విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఆదర్శ రైతులు వెంకట నారాయణ రెడ్డి, శంకరయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

## బొప్పాయి, ఉల్లి, టమోటా, పంట రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

కాంగ్రెస్, పిసిసి డెలిగేట్, వేలూరు శ్రీనివాసరెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి బాలం సుబ్బరాయుడు.



**పులివెందుల మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో బొప్పాయి ఉల్లి టమోటా పంటల రైతులు తీవ్రస్థాయిలో నష్టపోతున్నారని కాంగ్రెస్, పిసిసి డెలిగేట్, వేలూరు. శ్రీనివాసులు రెడ్డి, వైఎస్ఆర్ కడప జిల్లా కాంగ్రెస్, మాజీ కార్యదర్శి బాలం సుబ్బరాయుడు, వారు ఇరువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉల్లి పంటకు మద్దతు ధర లేక పంటలను పొలంలోనే వదిలే పరిస్థితి నెలకొందని ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి అప్పులు చేసి పంటలను సాగుబడి చేస్తే మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నారు. అలాగే టమోటా పంటకు గిట్టుబాటు ధరలు లేక దిక్కుతోచని పరిస్థితిలో రైతులు ఉన్నారని వారు పండించిన టమోటా పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని అలాగే బొప్పాయి రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేసి బొప్పాయి రైతులను ఆదుకోవాలని బొప్పాయి తైవాన్ రెడ్ లేడీ 786. వెల్కమ్ జ్ఞాన్యమైన విత్తనాలను హార్డీ కల్చర్ ద్వారా 50% సబ్సిడీతో రైతులకు సరఫరా చేసి నకిలీ విత్తనాల నుండి బొప్పాయి రచనలను రక్షించి రాష్ట్రంలో ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నామని వారు తెలిపారు..

## మిట్టమల్లేశ్వరునికి విశేష పూజలు



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణ పరిధిలోని ఎంతో పురా తనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారాన్ని పురస్కరించుకొని మిట్టమ ల్లేశ్వరుని విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున నుండి స్వామి వారికి ప్రధాన అర్చకులు రుద్ర శివ ఆధ్వర్యంలో స్వామివారికి పంచా మృత అభిషేకం, భస్మాభిషేకం, సహస్ర “ నామ అష్టోత్తర శతనామావళి, భీష్మాభిషేకం ,లింగాష్టకం తదితర పూజా కైకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తుల కు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సుధీకర రెడ్డి, నిర్వ హకులు మాట్లాడుతూ సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పరమశివునికి ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్ధలతో మొక్కలు చెల్లించి విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎండోమెంట్ సిబ్బంది ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం నిలబడిన వారికి అండగా ఉంటాం

**– కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి భరోసా**



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం మండలంలోని ఇడుపులపాయ గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపి నాయకులు, కార్యకర్తలు ఎంపి అవినాష్ రెడ్డిని కలిశారు. అనంతరం శాలువతో ఘనంగా సత్కరించారు. అలాగే తమ గ్రామంలో నెలకొన్న ఆయా సమస్యలను ఎంపి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎంపీ ఆయా సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కావలి క్రిష్ణతేజ, పోతిరెడ్డి శ్రావణ్, గోపీనాథ్, సుకరణ, సుధాకర్, ముని, చంద్రశేఖర్, రామాంజీ, లోకేష్, అంజీ, శివశంకర్, కృష్ణయ్య, శ్రీరాములు తదితర కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగ ప్రతిష్ట- రాగి చెట్టు వేప చెట్టు కల్యాణం

## భక్తులకు అన్నదానం

**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణ పరిధిలోని పార్లపల్లి రోడ్డు సమీపాన మొట్టమొదటిగా కొలువైన శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య కుటుంబ వంశీకుల సభ్యుల ఆధ్వర్యంలో నాగదేవతల ప్రతిష్ట రాగి చెట్టు వేప చెట్టు కళ్యాణం కమనీయంగా సాగింది. ఈ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఉదయాస్తమాన వేద పండితులచేమంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ, నవగ్రహపూజ ,సహస్రనామార్చన, ఉభయ దారుల సంకల్ప పూజ, పుణ్యావచం తదితర పూజ కార్యక్రమాల అనంతరం నాగదేవతలకు ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య కుటుంబ సభ్యుల చేతుల మీదుగా పంచామృత అభిషేకం, సుద్ధోదగా స్నానం,గణపతి హెూమ, నవగ్రహెూమ, వాస్తు హెూమం తదితర పూజ కైకర్యాల అనంతరం నాగదేవతల ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాగి చెట్టు వేప చెట్టు కళ్యాణం కమనీయంగా సాగగా భక్తులు వీక్షించి పారవర్షం పొందుతూ భగవంతుని దీవెనలు అందుకున్నారు.



అనంతరం వేద పండితులచే శ్రీరామ్ కుటుంబ సభ్యులు ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ అన్నప్రసాద కార్యక్రమాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవ కమిటీ సభ్యులు ఆలయ చైర్మన్ శ్రీరామ్ సుబ్బయ్య కుటుంబ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్బిఐ బ్యాంకులో ఖాతాదారుల అవస్థలు

**- బ్యాంకు చుట్టూ తిప్పుకుంటున్న అధికారులు**

**- పట్టించుకోని జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు**

**దువ్వూరు,మేజర్‌న్యూస్ :** దువ్వూరు ఎస్బిఐ బ్యాంకులో ఖాతాదారులు ఇబ్బందులు గురవుతున్నారు. ఖాతాదారులుబ్యాంక్ లోకి పని మీద వెళితే బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యం సమాధానం చెబుతున్నారు, ఈ కేవైసీ కోసం బ్యాంకు లోకి వెళితే,బ్యాంకులో సిబ్బంది లేరు నాలుగు రోజుల తర్వాత రండి అని సమాధానం ఇస్తున్నారు. ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోజు బ్యాంకు చుట్టూ తిరగాలంటే ఇంటి దగ్గర పనులు చేసుకోకుండా ఇబ్బందులు గురవు తున్నామని ఖాతాదారులు తెలుపుతున్నారు, ఏదేమైనా దువ్వూరులోని ఎస్బిఐ బ్యాంకు వారు నిర్లక్ష్యం సమాధానం చెబుతున్నారని ఖాతాదారులు తెలుపు తున్నారు. ఎస్బిఐ బ్యాంక్ సిబ్బందిపై జిల్లా ఉన్నతాధికారులు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరు తున్నారు. బ్యాంకులో లావాదేవీలు సరిగా జరగకపోతే ఇతర బ్యాంకు లోకి ఖాతా దారులు వెళ్లిపోవచ్చు అని కూడా వినియోగదారులు చర్చించు కుంటున్నారు



## సెక్యూరిటీ సూపర్వైజర్ ను తొలగించడం అన్యాయం. వారిని విధుల్లోకి తీసుకోవాలి



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** కడప వైఎస్ఆర్ జిల్లాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ సూపర్వైజర్ ను విధులకు రావద్దని చెప్పడం సరైనది కాదని ,వారిని విధుల్లోకి తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి అతిథి సింగ్ కు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఆప్కాస్ , సి ఐ టి యు నాయకత్వం , వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా జిల్లాలో 2019 నుంచి 2025 వరకు గురుకుల పాఠశాలలో సెక్యూరిటీ సూపర్వైజర్ గా పనిచేస్తున్నారని తెలిపారు. అయితే ఇప్పుడు ప్రస్తుతం సెక్యూరిటీ సూపర్వైజర్ ను తొలగిస్తామని చెప్పడం , మౌఖికంగా రావద్దని చెప్పడం సరైనది కాదన్నారు. గత 7 సంవత్సరాలుగా పనిచేసిన సెక్యూరిటీ సూపర్వైజర్ ను తీసేయడం అంటే వారి కుటుంబాలను రోడ్డుపాలు చేయడం తప్ప ఇంకోటి కాదని తెలిపారు .కనుక వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు .

## జీయస్టి 2.0, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం



**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోరు మామిళ్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం అధ్యాపకులు పర్వీన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్యూల్ డేవిడ్ రాజ్ అధ్యక్షతన "జీయస్టి 2.0, సూపర్ సేవింగ్స్" పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పన్నులపై అవగాహన కలిగి ఉండాలని, జీయస్టి ఉపయోగాల గురించి గ్రామాలలో తెలియపరచాల న్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రకాష్ రావు, వెంకట రావు, యంబడి ఈశ్వరయ్య, రవిచంద్ర, డాక్టర్ సులోచన, శోభన్ బాబు ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

# డిజిటల్ బుక్ తో రెడ్ బుక్ అరాచాలకు అడ్డుకట్ట

**వైకాపా కడప నార్త్ జోన్ అధ్యక్షులు బి.హెచ్.ఇలియాస్**

**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** డిజిటల్ బుక్ పోస్టర్ ను నార్త్ జోన్ డివిజన్ కార్పొరేటర్లు, ఇంచార్జ్ లు, కమిటీ సభ్యులతో కలిసి సోమవారం వైకాపా కడప నార్త్ జోన్ మండల అధ్యక్షులు ఇలియాస్ బి.హెచ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ బుక్ అరాచకాలను అడ్డుకునేందుకే డిజిటల్ బుక్ అని తెలిపారు.కార్యకర్తల భద్రత,ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యమని చెప్పారు.పార్టీ మారిన నేతలు తిరిగి వైయస్ఆర్ సీపీలోకి రావాలంటే కార్యకర్తల అనుమతి తప్పనిసరి అన్నారు. వైయస్ఆర్ సీపీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మన ప్రభుత్వం వచ్చిన వెంటనే సత్వరమే పరిష్కారం లభించేలా వైయస్ఆర్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ రూపొందించారని అన్నారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ అమలు పరచలేక ప్రజల దృష్టి పక్కదారి మళ్లించేందుకు వైయస్ఆర్ సీపీ ముఖ్య నాయకులపై, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని కనీసం 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు,గత 5 ఏళ్ళ జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రవేశపెట్టిన పథకాలను కాపీ కొట్టి పేర్లు మార్చారన్నారు.విద్యా, వైద్యం,వ్యవసాయం,లా అండ్ ఆర్డర్ ఇలా అన్ని తిరోగమనమే అన్నారు. సంపద సృష్టిస్తాను.. సూపర్ సిక్స్ ఇస్తాము అని చెప్పి ప్రజలను దారుణంగా మోసం చేశారన్నారు . నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఎత్తేశారన్నారు. అమ్మకు వందనం ,వృద్ధాప్య పింఛన్ రెండు అరకొర గా అమలు చేస్తూ విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వంపై అనతి కాలంలోనే ప్రజావ్యతిరేకత వచ్చిందన్నారు. రెడ్ బుక్ అరాచకాన్ని అడ్డుకునేందుకే డిజిటల్ బుక్ అని, ఈ యాప్ ద్వారా నిర్దేశించిన క్యూ ఆర్ కోడ్ తో కార్యకర్తల సమస్యలు



తెలియజేయవచ్చన్నారు.ఈ సమాచారం కేంద్ర పార్టీ కార్యాలయంలో నమోదు అవుతుందన్నారు.కార్యకర్తలకు డిజిటల్ బుక్ పై అవగాహన కల్పిస్తామన్నారు. వైకాపా రాష్ట్ర బిసి ప్రధాన కార్యదర్శి బసవరాజు, రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి అలీ అక్బర్, రాష్ట్ర మైనారిటీ సెల్అధికార ప్రతినిధి షేక్ గౌస్ బాషా(చాక్లెట్), కడప పట్టణ మైనారిటీ అధ్యక్షులు షఫీ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారి పార్టీ నాయకులపై గాని వారి స్వంత మనుషులపై ఏదైనా చిన్న మాట మాట్లాడినా గొంతు చించుకొని మాట్లాడే వారన్నారు. శాసన మండలి సభ్యులు నాగబాబు అయితే వ్యంగంగా మాట్లాడే వారని, తన స్వంత అన్న మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి దేవాలయం లాంటి అసెంబ్లీలో బాలకృష్ణ వాడు, వీడు అని సంబోధించి ఇన్ని రోజులు అయిన ఉలుకు లేదు పలుకు లేదన్నారు. కనీసం బాలకృష్ణ మాటలు తప్పు అని ఖండించలేదన్నారు. లేదు ఏమి మాట్లాడిన పవన్ కు తన ఉప ముఖ్యమంత్రి పదవి ఏమవుతుందోనని, నాగబాబు తనకు రావలసిన మంత్రి పదవి వస్తుందో లేదో అని భయపడుతుండవచ్చని ప్రజలు గుస గుస లాడుకుంటున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షంషీర్,అజ్మతుల్లా, ఆరిఫుల్లా, జీలాన్,నార్త్ జోన్ కమిటీ ప్రధాన కార్యదర్శి అల్తాఫ్, ఉపాధ్యక్షులు మహమ్మద్ గౌస్ ( బాబు ) సభ్యులు మహమ్మద్ అలీ, గౌస్, ఇమ్రాన్,సమీర్, ఖాదర్, రెహమాన్, ఎన్.ఆర్.ఐ లు షేక్ గయాజ్, ఫారూఖ్ పాల్గొన్నారు.

# సిద్దయ్యకు సన్మానం

**పులివెందుల మేజర్‌న్యూస్ :** సెప్టెంబర్ 10వ తేదీన కడపలో జరిగిన ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా ఎన్నికలలో, పులివెందులలో సబ్ యూనిట్ ఆఫ సర్‌గా పనిచేస్తున్న సిద్దయ్య ను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్ను కోబడ్డారు.ఈ సందర్భంగా పులివెందుల ఎన్జీఓ హోమ్‌లో జరిగిన సమా వేశంలో తాలూకా అధ్యక్షుడు జగన్నాధ రెడ్డి ఆధ్వర్యంలో సిద్దయ్య కు ఘనంగా సన్మానం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లా డుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన జిల్లా అధ్యక్షులు .బి.శ్రీనివాసులు కి రాష్ట్ర అధ్యక్షులు.విద్యాసాగర్ కి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి .డి.వి.రమణ కి కృతజ్ఞతలు తెలియజేసుకునుచున్నాను. అలాగే జిల్లా అధ్యక్షులు ఏమీ



ఆదేశిస్తే ఆపని చేయడానికి సిద్ధంగా ఉన్నాను నా శక్తీ మేరకు సంఘ అభివృద్ధి కోసం పని చేస్తాను అని సిద్దయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో పులి వెందుల తాలూకా ఎన్జీఓ సెక్రటరీ ప్రసాద్. సహాయ అధ్యక్షులు సుకు మార్, మాజీ అధ్యక్షులు గురుప్రసాద్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

# మొక్కజొన్నలను మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**- రైతులను నిండా ముంచుతున్న వ్యాపారస్తులు**

**- కనీస మద్దతు ధర 2400 ఉన్నా కూడా కేవలం 1500 నుండి 2000 లోపల మాత్రమే కొనుగోలు చేస్తున్నారు**

**దువ్వూరు,మేజర్‌న్యూస్ :** దువ్వూరు మండలంలో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతము నూర్పిల్లు కొనసాగుతున్నాయి. వ్యాపారస్తులు అంత సిండికేట్ అయి రైతులు వద్ద 1500 నుంచి 2000 రూపాయలతో కోనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వము మద్దతు ధర ప్రకటించిన 2400 రూపాయలతో రైతుల వద్ద నుంచి ప్రభుత్వమే వెంటనే కొనుగోలు చేయాలని రైతులు తెలియజేస్తున్నారు.అధికారులు, నియోజకవర్గ శాసనసభ్యులు సుధాకర్ యాదవ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం వెంటనే స్పందించి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.దువ్వూరు మండలములోని దాసరి పల్లె, నీలాపురం, మూడిండ్లపల్లె, బాలాయపల్లె, మధిరేపల్లె, చిన్న సింగన పల్లె, పెద్ద సింగన పల్లె, చల్లబసాయపల్లె, గొల్లపల్లె,మనేరంపల్లె, గుడిపాడు, రామాపురం, మీర్జాఖాన్ పల్లె,రామ్ సాయినగర్, జిల్లెల్ల, భాకరాపురం, తదితర గ్రామాలలో రైతుల మొక్కజొన్న పంట సాగును విస్తారంగా చేశారు. నుర్పిళ్లు కూడా మొదలయ్యాయి. కేంద్రం మొక్కజొన్నలకు కనీస మద్దతు ధర గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది175/- రూపాయల పెంచి 2400/- రూపాయల గా చేసింది. కానీ రైతులకు దీనివల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీనికి కారణం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం. దీనివల్ల వ్యాపారస్తులు అందరూ సిండికేట్ గా ఏర్పడి, ధర అమాంతం తగ్గించి రైతులను నిండా ముంచుతున్నారని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కావున వెంటనే మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్నలను ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని



దువ్వూరు మండలంలోని రైతులు అధికారులను మరియు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను కోరుతున్నారు. వ్యాపారస్తులందరూ సిండికేట్ గా ఏర్పడి పైన రేటు బాగా పలుకుతున్న కూడా కేవలం 1500 నుండి 2000 లోపు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని దీనివల్ల ఆరుగాలం శ్రమించి పండించిన రైతన్నకు నష్టాలే మిగులుతున్నాయని రైతుల వాపోతున్నారు. మొక్కజొన్న సాగుకు సుమారుగా ఎకరాకు 30 వేల ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు.వెంటనే మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 2400/-రూపాయల కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# హాలో మాదిగ చలో కడప - జయప్రదం చెయ్యండి.

## యం. ఆర్. పి. యస్. నాయకులు



**కడప మేజర్‌న్యూస్ :** సామాజిక ఉద్యమానికి మరో మైలురాయిగా, అక్టోబర్ 15న కడపలో మాదిగల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా కడప కలెక్టరేట్ ఆవరణలో మహా జననేత, పద్మశ్రీ డాక్టర్ మందకృష్ణ మాదిగ సభ కోసం ప్రచార కరపత్రాలను విడుదల చేశారు వి. హెచ్. పి. యస్.రాష్ట్ర అధ్యక్షులు ఏ.చిన్నసుబ్బయ్య యాదవ్, యం. యస్. పి. జిల్లా అధికార ప్రతినిధి కే. మాతయ్య మాదిగ, వి. హెచ్. పి. యస్. జిల్లా అధ్యక్షులు డి. మాతయ్య తదితరులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగ హక్కులను అట్టడుగు వర్గాలకు నిజంగా చేకూర్చే దృఢ సంకల్పంతో, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గత 30 ఏళ్లుగా ఎలాంటి పదవులు ఆశించకుండా, ఎటువంటి రాజకీయ పార్టీలో చేరకుండా నిస్వార్థంగా, అహర్నిశలు పోరాటం చేస్తున్నారన్నారు.ఎస్సీ వర్గీకరణ సాధన కోసం చేసిన విశ్వరూప మహాసభ, ప్రధానిని ఆశ్చర్యపరిచిన విధానం, దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీం కోర్టులో చారిత్రక విజయాన్ని సాధించడం ౹ ఇవన్నీ మాదిగ ఉద్యమంలో చరిత్రను కొత్త అధ్యాయన్ని లిఖించాయి.ఈ నేపథ్యంలో, విద్య, ఉద్యోగ, పదోన్నతుల్లో మాదిగల పురోగతి, సామాజిక న్యాయం, వృద్ధుల ఆసరా, వితంతువుల పింఛన్, వికలాంగుల భరోసా, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు అన్నీ మందకృష్ణ మాది గారి ఉద్యమాల ఫలితమే అని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 15న కడప నగరానికి విచ్చేస్తున్న అభినవ అంబేద్కర్, సామాజిక ఉద్యమ స్ఫూర్తి ప్రదాత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కు భారీ ర్యాలీ, ఊరేగింపు, ఘన సన్మానం మరియు మాదిగల ఆత్మీయ సభ ఏర్పాటు చేస్తామని కాబట్టి ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి, మన జననేతకు అశేష ప్రజాభిమానంతో ఘన స్వాగతం పలుకాలని కడప జిల్లా ఎమ్మార్పీఎస్ పిలుపునిస్తోంది.

## ఫిర్యాదులు పునరావృతం కాకుండా పరిష్కారం చూపాలి

### - తహసీల్దార్ యేమిరెడ్డి సంజీవరెడ్డి - ఎంపీడీవో సుబ్బారెడ్డి



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఆయా పిర్యాదుల పై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి పరిష్కారం చూపాలని మండల అధికారులకు తహసీల్దార్ యేమిరెడ్డి సంజీవరెడ్డి, మండల అభివృద్ధి అధికారి జె. సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండల తహ సీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. పలువురు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డి లు మాట్లాడుతూ మండలంలో ఆయా శాఖల ద్వారా వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని మండల అధికారులకు సూచించారు. ఈ కార్య క్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ శివకుమార్, ఉపాధి హామీ ఏపీవో లక్ష్మీనారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ లు సౌజన్య, కళావతి, హౌసింగ్ ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటమే మా ప్రధాన లక్ష్యం

### -నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు శివ మోహన్ రెడ్డి



**ఎర్రగుంట్ల మేజర్‌న్యూస్ :** ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటమే తమ పార్టీ ప్రధాన లక్ష్యం అని జమ్మలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు శివ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని ప్రకాష్ నగర్ కాలనీలో ఓటు దొంగ గద్దె దిగు అనే నినాదాలతో ఓటు చోరీల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బలపడాలంటే ఒక్కో ఓటు విలువను కాపాడాలన్నారు. ఎన్నికల్లో జరుగుతున్న ఓటు చోరీలు దేశ భవిష్యత్తుకు ముప్పు , ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. ఓటు చోరీని అరె కడదాం రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే శక్తివంతమైన నినాదాలు చేశారు. ప్రజలే కాంగ్రెస్ బలం ప్రజలే మా ఆశ్రయం అని స్పష్టం చేస్తూ కాంగ్రెస్ ఎల్లప్పుడు ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ర ప్రసాద్, శివారెడ్డి, జాన్, ప్రశాంత్ కుమార్, రాంబాబు, సుధాకర్ లతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిపోర్టర్ ల ను సన్మానించిన అమ్మవారిశాల అద్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు



**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్ :** శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం నందు సోమవారం నాడు బ్రహ్మంగారి మఠం మండల సూర్య దినపత్రిక విలేఖరి వెంకటసుబ్బయ్య ను అమ్మవారిశాల అద్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు , కమిటీ సభ్యులు కలిసి అమ్మవారి దగ్గర ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపించి దుశ్శాలువా తో ఘనంగా సన్మానించారు... సందర్భ ముగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం అద్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు మాట్లాడుతూ... దసరా శరన్నవరాత్రి మహో త్సవాల్లో భాగంగా బ్రహ్మంగారి మఠం అమ్మవారి శాల నందు జరిగిన 11 రోజుల దసరా ఉత్సవాలు, దేవస్థానం నందు జరిగిన వివిధ రకాల పూజలు ప్రతి కార్యక్రమం భక్తులకు, ప్రజలకు తెలిసే విధంగా సూర్య దినపత్రిక నందు ప్రచురించడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. అలాగే వివిధ పత్రికలలో ప్రచురించిన విలేకరులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## కల్తీ మద్యం తయారుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### వైఎస్ఆర్సిపి యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** కల్తీ మద్యం తయారీదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సిపి యువజన విభాగం పులివెందుల నియోజకవర్గ అధ్యక్షుడు వి.రామ్ లక్ష్మణ్ రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి లు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాసిరకమైన మద్యాన్ని స్పిరిట్ను తీసుకొచ్చి ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నాయి గత ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాల మీద అసత్య ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి, మందు వంటి మత్తు పదార్థాలను నిషేధించాలని కోరారు. అక్రమంగా కల్తీ మద్యం తయారు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఈ అక్రమ కల్తీ మద్యం వలన అనేకమంది చనిపో తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం స్పిరిట్ తయారు ఇలాంటి సంఘటనపై కఠినంగా చర్యలు ఉండాలని, బెల్ట్ షాపులు అమ్మకాలు జరుపుతున్న వారిపై కఠినంగా చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కల్తీ మద్యం తయారీదారులు వెనక ఉన్న వారిపై కూడా చర్యలు ఉండాలని అన్నారు. బెల్ట్ షాప్ లో అరికట్టాలని మద్యం తయారీదారులపై చర్యలు తీసుకోవాలని, కల్తీ మద్యంపై సమగ్ర విచారణ చేయాలని తయారీదారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

# మడువంకతో రైతుకు కష్టాలు...

## వరద నీరుతో ఉధృతంగా ప్రవాహం - పొలాల్లో ఇసుక మేటలు



**రాజుపాళెం,మేజర్‌న్యూస్ :** వరద ప్రవాహం ముడువంక ఇరువైపులా పంట పొలాలు నీట మునుగుతున్నాయి సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి వంకలో వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహించింది రాజుపాళెం-వెంగళాయపల్లె గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి లో లెవెల్ వంతెన పై మూడు అడుగుల మేరవరదనీరుప్రవహించిందిప్రొద్దుటూరు-ఆళ్లగడ్డ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయిఅర్కట వేముల సమీపంలోని మడు వంక వద్ద రాకపోకలకు ఇదే పరిస్థితి నెలకొంది రాజుపాళెం మండలంలో17.2 మిమి వర్షపాతం నమోదైనప్పటికీ పెద్దముడియంమండలంలో కురిసిన వర్షాలకు మడు వంకకు ఎక్కువ స్థాయిలో వరద నీరు వచ్చి చేరడంతో వంక ఇరువైపులా ఉన్న పొలాలు మరోమారు నీట మునిగాయి గత సెప్టెంబర్ 20 నవచ్చిన భారీ వరద ప్రవాహం తో మడువంకకు ఇరువైపులా సాగైనా పత్తి వరి జొన్న కంది తదితర పంటలు నీటి మునగడమే కాకుండా పొలాల్లో ఇసుక మేటలు వేశాయి కొన్ని పొలాల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించింది పర్లపాడు అర్కటవేముల ఎస్సీ కాలనీలలో వరదనీరు ప్రవహించడం వల్ల ఇళ్లల్లోనినిత్యవసర వస్తువులు నీటమునిగాయి పశు సంపదకు నష్టం కలిగించిందితరచుగా మడువంకకు వరదలు వస్తున్నాయి గతంలో నీరు చెట్టు కిందమడు వంకలో పుడుకతీత పనులు చేపట్టిన మళ్లీ కంపచెట్లు పిచ్చి మొక్కలు ఎక్కువ కావడంతో వంక ఇరుకై వరద ప్రవాహం వెళ్లలేక పొలాలపై ప్రవహిస్తోంది గత వరదల్లో పంట నష్టపోయిన రైతులకు పశువులు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందించాలని మడువంక వరద బాధితులు విజ్ఞప్తి చేసుకుంటున్నారు

# శ్రీనివాసనగర్ ఓట్ చోరీ ర్యాలీ



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస్ నగర్ లో సోమవారం ఓట్ చోరీ క్యాంపైన్ నిర్వహించి, ప్రజల నుండి ససంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర యువనేత రాహుల్ గాంధీ, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి పిలుపు మేరకు ఈ ప్రచారాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణే నిజమైన దేశసేవ అన్న ఆలోచనతో ప్రజల్లో అవగాహన పెంచేందుకు, ఓటర్ల హక్కుల పరిరక్షణపై స్పష్టమైన సందేశం ఇవ్వడమే లక్ష్యమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, డీసీసీ సెక్రటరీ అప్పపోగులు ఎల్లయ్య, గౌస్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై పట్టించుకోని అధికారులు...



కలసపాడు మేజర్‌న్యూస్ : కలసపాడు మండలం సింగరాయపల్లి గ్రామంలో ఆర్ అండ్ బి మెయిన్ రోడ్డులో నివసిస్తున్న కాలనీ నుండి రోడ్డు మీదగా డ్రైనేజ్ కాలువ ప్రవహిస్తుంది అయితే పారిశుద్ధ కార్మికులు కాలువ క్లీన్ చేయకపోవడంతో చెట్లు మొల వటం వల్ల రోడ్డుపైకి డ్రైనేజ్ వాటర్ రావడంతో సిమెంట్ రోడ్డు ఆనుకొని ఉండడంతో అటు ఇటు గిద్దలూరు పోరుమామిళ్ల రోడ్డులో వెళ్తున్న మోటర్ వెహికల్స్ జారీ పడటం దెబ్బలు తగిలించుకోవడం జరుగుతుంది డ్రైనేజీని క్లీన్ చేయమని సంబంధిత అధికారులకు చెప్పిన వినడం లేదని గ్రామస్తులు వ్యక్తం చేశారు 10 రోజు నుండి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చెప్పిన చేయకపోవడంపై మండిపడుతున్నారు మండల పై అధికారులు స్పందించి చర్య తీసుకోవాలని గ్రామ యువకులు ప్రజలు కోరుకుంటున్నారు.


# గ్రామ సభలు అంటే అధికారులకు తెలియదా ?





కలసపాడు మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వము అక్టోబర్ రెండవ తేదీ నుంచి గాంధీ జయంతి నుంచి ప్రతి గ్రామ పంచాయతీలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలలో గ్రామసభలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించారు కానీ కలసపాడు లో ఉపాధి సిబ్బంది ఇష్టారాజ్యంగా వివరిస్తున్నారు దీనిపైన ఎపిఒ ను వివరణ కోరదామని ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయడం లేదంటే వారు ఆఫీస్ కు వచ్చినారా లేదా తెలి యాల్సి ఉంది కలసపాడులో సోమవారం గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఆది వారం గ్రామ పంచాయతీ వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా అనౌ న్స్మెంట్ చేశారు. సమస్యలు ఉన్న ప్రజలు గ్రామ సభ ఉందని కలసపాడు సచివాలయం వద్దకు వచ్చినా అధికారులు రాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రామ సభలు నిర్వహిస్తుంటే వీటిని అధికారులు నిర్వీర్యం చేస్తున్నారని కలసపాడు మేజర్ గ్రామపంచాయతీలో మరియు లింగారెడ్డిపల్లి గ్రామపంచాయతీలలో గ్రామసభలు జరగలేదంటే దీనిపై సంబంధించిన అధికారులు వెంటనే స్పందించి సంబంధించిన అధికారుల మీద చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

## అడివయ్య స్వామికి ప్రత్యేక పూజలు



అట్లూరు, మేజర్‌న్యూస్ : అట్లూరు మండలంలోని అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద వెలసిన అడివయ్య స్వామి మఠం వద్ద అశ్వయుజ పౌర్ణమి సందర్భంగా సోమవారం సాయంత్రం అత్యంత వైభవంగా వేడుకలు జరిగాయి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ వేడుకలలో పాల్గొని అడివయ్య స్వామి సమాధికి పూలమాలలు వేసి పూజలు చేశారు ప్రజలు అడివయ్య స్వామిని సత్యమైన దేవుడిగా కొలుస్తున్నారు మొక్కులు తీర్చుకుంటే కోర్కెలు నెరవేరుతాయని అడివయ్య స్వామి భక్తుల నమ్మకం అనంతరం ఉపాధ్యాయుడు పట్టెం వెంకటసుబ్బారెడ్డి, జిల్లా బిసి సంఘం నాయకుడు బుర్రి రాజగోపాల్ యాదవ్, బుర్రి గోపాలకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో అడివయ్య స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు

## మీకోసం - మనందరి కోసం ఆరోగ్య లక్ష్యం

**గణేష్‌పురంలో నేడు ఉచిత వైద్య శిబిరం**

**ముత్తూట్ ఎం. జార్జ్ ఫౌండేషన్ సుశీల్ ఫౌండేషన్ సంయుక్తంగా**

వల్లూరు మేజర్‌న్యూస్ : ప్రజల ఆరోగ్యంపై అవగాహన పెంచుతూ, సామాజిక బాధ్యతగా ముత్తూట్ ఎం. జార్జ్ ఫౌండేషన్ (హైదరాబాద్) సంస్థతో కలిసి సుశీల్ ఫౌండేషన్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు, ఈ శిబిరం నేడు మంగళవారం ఉదయం 6:00 నుంచి 9:30 గంటల వరకు, వల్లూరు మండలం గణేష్‌పురం బస్టాండ్ సమీపంలోని పానీపూరి సెంటర్ దగ్గర ఉన్న ఖాళీ స్థలంలో నిర్వహించబడుతుంది, ఈ శిబిరంలో కిడ్నీ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, లివర్ వ్యాధులు, షుగర్, బీపీ వంటి ఆరోగ్య సమస్యలకు సంబంధించిన టెస్టులు పూర్తిగా ఉచితంగా నిర్వహించబడతాయి, పరీక్షలు పూర్తయ్యిన అనంతరం ఉచిత రిపోర్టులు కూడా అందించబడతాయి, ఇందులో రెండు లేదా మూడు సంవత్సరాలుగా దీర్ఘకాలిక వ్యాధులతో మందులు వాడుతున్న రోగులు, తమ వివరాలను ముందుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది, పరీక్షల ఖచ్చితత కోసం శిబిరానికి రాబోయే వారు ఎటువంటి ఆహారం తినకుండా (ఖాళీ కడుపుతో) హాజరుకావాలని సుశీల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుశీల్ కుమార్ తెలిపారు..

## కొద్దిపాటి వర్షానికి జలమయం

**- సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం - జనసేన ఇంఛార్జీ డా.హరీష్**



వేంపల్లె మేజర్‌న్యూస్ : కొద్దిపాటి వర్షానికే ఇమామ్ నగర్ ప్రాంతం జలమయం అవుతుందని స్థానిక ప్రజలు జనసేన నియోజకవర్గ ఇంచార్జీ డా.హరీష్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఆ ప్రాంతాలను జనసేన నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ప్లాస్టిక్ వర్షాలు మురికి కాల్వల్లో పెరు కుపోయి.. కొద్దిపాటి వర్షానికే తమ ప్రాంత వీధులు చెరువుల్లా తలపిస్తున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కారం చేయాలని కోరారు. దీంతో ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ మల్లికార్జున, జయచంద్ర తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఖాజీపేట లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "ఓట్ చోర్ - గద్దె చోడ్" కార్యక్రమం



ఖాజీపేట మేజర్‌న్యూస్ : "ఓట్ చోర్ – గద్దె చోడ్" కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఖాజీపేటలో గడప గడపకు తిరిగి సంతకాల సేకరణ కార్యక్రమం చేశారు.ఈ కార్యక్రమం మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ రామసుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఖాజీపేటలో జరిగిన ఇంటింటి ప్రచారంలో మండల కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఫయాజ్, షేక్ హాజీ గౌస్ ఓటు చోరీ కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ "ప్రజాస్వామ్యం బలపడాలంటే ఓటు విలువను కాపాడుకోవాలన్నారు. ఎన్నికల్లో జరుగుతున్న ఓటు చోరీలు దేశ భవిష్యత్తుకు ముప్పు అని,ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత" అని స్పష్టం చేశారు. "ఓటు చోరీని అరికడదాం రాజ్యాంగాన్ని కాపాడుకుందాం" అనే నినాదాలు చేశారు. ప్రజలే కాంగ్రెస్ బలం, ప్రజలే మా ఆశయం అని మండల కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఫయాజ్ షేక్ హాజీ గౌస్ అన్నారు, కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ఖాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఫయాజ్, కాజీపేట మైనారిటీ నాయకులు షేక్ హాజీ గౌస్, ఓబులరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పగించాలి

**నకిలీ మద్యం ప్లాంట్ వ్యవహారంలో బిగ్ బాస్ ఎవరో గుర్తించాలి**


**వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్**




కడప – మేజర్‌న్యూస్ : వైయస్ జగన్ సర్కార్ లో ప్రభుత్వమే పారదర్శకంగా మద్యం వ్యాపారం చేసినా, అందులో ఎవరి ప్రమేయం లేకపోయినా ఎన్నికల ముందు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ తో పాటు గల్లీ లీడర్లు సైతం వైఎస్ఆర్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై విషం చిమ్మి, రాజకీయంగా లబ్ది పొందారని, నేడు కూటమి సర్కార్ అగ్ర నేతల కనుసన్నల్లోనే తెలుగుదేశం పార్టీ నేతలు ములకలచెరువులో నకిలీ మద్యం ప్లాంట్ ఏర్పాటు చేసి వందల కోట్ల రూపాయల నకిలీ మద్యం వ్యాపారం చేశారని దీని వెనుక ఉన్న బిగ్ బాస్ ఎవరో గుర్తించాలని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. కడప నగరంలోని వైఎస్ఆర్సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం సాయంత్రం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ... దీని వెనుక బిగ్ బాస్ లు లేకపోతే ఇంత పెద్ద నకిలీ మద్యం స్కాం జరగదనేది జగమెరిగిన సత్యం అని ఆయన తెల్చి చెప్పారు. కూటమినేతలు సచ్చీలురని, నిజాయితీకి మారుపేరని చెప్పుకునేందుకు తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జి జయ చంద్రారెడ్డి, టిడిపి నేత సురేంద్రనాయుడు ను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని దీనిని రాష్ట్ర ప్రజలు నమ్మరు గాక నమ్మరని ఆయన స్పష్టం చేశారు. తాను తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు తంబళ్లపల్లె టిడిపి రాష్ట్ర పరిశీలకునిగ ఉండేవాడినన్నారు. టిడిపి ని ఎన్నో ఏళ్లుగా నమ్ముకొని ఉన్న ప్రజాబలం గల నేత,మాజీ శాసనసభ్యుడు శంకర యాదవ్ ను కాదని ఎన్నికల ముందే జయ చంద్ర రెడ్డికి టికెట్ ఇచ్చారంటేనే దీని వెనుక మతలబు ఉన్నట్లు స్పష్టమైందన్నారు. ములకల చెరువులో నకిలీ మద్యం ప్లాంట్ ఉన్నట్లు బయటపడిందని,ఇదే కాక రాష్ట్రంలో మరిన్ని ప్లాంట్లు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందని వాటి వెనుక ఉన్న బడా నేతలను బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మద్యం కేసులో వైసీపీ నేతలు హస్తం లేనప్పటికీ జగన్ కు అనుకూలంగా ఉన్న నేతలు అందరిని జైలుకు పంపి వారికి బెయిల్ రాకుండా చాలా రోజులు వేధించి పైశాచిక ఆనందం పొందారన్నారు. ప్రజల్లో వైఎస్ఆర్సిపిని,జగన్ ను చులకన చేసేందుకు కూటమి సర్కార్ దుష్ట పథకం వేసిందని, కుట్ర పన్నిందని ఆయన దుయ్యబట్టారు. జగన్ సర్కార్ లో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపితే దానిని నకిలీ మద్యం గా ప్రజల ఆరోగ్యాన్ని హరించే విష%శీ% గా ప్రచారం చేసిన కూటమినేతలు నేడు నకిలీ మద్యంతో ఎందరికి కిడ్నీలు,లివర్లు పాడై ఉంటాయో నని ఆయన ఆవేదన చెందారు. హైవేకు ప్రక్కనే, జనసంచారం ఉన్న ప్రాంతంలోనే నకిలీ మద్యం ప్లాంటు ఏర్పాటు చేశారంటేనే దీని వెనుక కీలక వ్యక్తులు, బిగ్ బాస్ లో ఉన్నట్లు స్పష్టమైనందున నకిలీ మద్యం కేసును సిబిఐ కి అప్పగించాలని రెడ్య%శీ% డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మేధావుల ఫోరం మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు మూలే భరత్ రెడ్డి ,వైఎస్ఆర్సిపి మైదుకూరు మండల అధ్యక్షుడు కే.పి లింగన్న లు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి పేదలకు వరం

### ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆయన అనారోగ్య పరిస్థితులతో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన 99 మంది లబ్ధిదారులకు మంజూరైన 49,49,044 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన చెక్కులను, రాజుపాలెం మండలం గాదెగూడూరు గ్రామానికి చెందిన గోన అభిషేక్ కు మంజూరైన 10 లక్షల ఎల్వోసీని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజల వైద్య ఖర్చుల నిమిత్తం సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్వోసీలు అందిస్తూ తానున్నానని భరోసా కల్పిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రజలందరూ అండగా ఉండాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదల మేలు కోరే మంచి ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కమాల్ బాషా, టిడిపి నాయకులు సుధాకర్‌రెడ్డి, వద్దిబాలుడు, ఘంటసాల వెంకటేశ్వర్లు, నూరి, సోమా బాలయ్య, లక్ష్మీపేట గురివిరెడ్డి, సానా వెంకటసుబ్బారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సిద్దయ్య, శ్రీనివాసుల రెడ్డి, పగిడాల సుబ్బారెడ్డి, ఇట్టే సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకే దేశం, ఒకే పన్ను విధానం ప్రయోజకరం

### జీఎస్టీ 2.0 పై అవగాహన



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** ఒకే దేశం, ఒకే పన్ను విధానం ప్రజలకు ఎంతో ప్రయోజకరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర అన్నారు. సోమవారం కళాశాల జీఎస్టీ 2.0పై విధ్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే వాణిజ్య విభాగం అధ్యాపకురాలు డా.మల్లేశ్వరమ్మ మాటాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా స్వదేశీ వస్తువుల వినియోగం పెరిగి, ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వివరించారు. జీఎస్టీ 2.0 అమలు, స్లాబ్ ధరల పై విధ్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సతీష్, అధ్యాపకులు వినోద్, డా.ఓబుల్ రెడ్డి, డా.నాగలక్ష్మిదేవి, షఫీ, కిరణ్మయి, కేశమ్మ తదితరులు పాల్గొన్నారు.

# టపాసుల గోడౌన్‌లను తనిఖీ చేసిన సీఐ, ఎస్ఐ

### భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** పోరుమామిళ్ల మండలంలోని టపాసుల అమ్మకం కేంద్రాలు మరియు గోడౌన్లను పోరుమామిళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, మరియు ఎస్ఐ కొండా రెడ్డిలు సోమవారం తనిఖీ చేశారు. అనంతరం షాపు యజమానులకు సిఐ శ్రీనివాసులు కొన్ని సూచనలు చేయడం జరిగింది. అన్ని టపాసుల షాపులు లైసెన్స్ పొందిన ప్రదేశాలలోనే ఏర్పాటు చేయాలి. గోడౌన్లు జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ఉండరాదు. షాపుల వద్ద ఫైర్ ఎక్స్టింగ్విషర్, ఇసుక బకెట్లు, నీటి బారెల్లు తప్పనిసరిగా ఉంచాలి. షాపులలో విద్యుత్ వైరింగ్ సురక్షితంగా ఉండాలి. ధూమపానం (స్మోకింగ్), మంటలు వెలిగించడం, మొబైల్ ఉపయోగం ఖచ్చితంగా నిషేధం. షాపుల వద్ద బ్యానర్లు మరియు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఫైర్ సర్వీస్, పోలీస్, రెవెన్యూ శాఖల అనుమతి లేకుండా పటాకుల నిల్వ, విక్రయం చేయరాదు. చిన్న పిల్లల చేత పటాకుల నిర్వహణ జరగకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి. భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# దువ్వూరులో భారీ వర్షం..

### 47.5 మీ.మీ వర్షపాతం
### సుగాలి తండాకు రాకపోకలకు అంతరాయం

**దువ్వూరు, మేజర్‌న్యూస్:** దువ్వూరు మండలంలో సోమవారం తెల్లవారుజామున భారీవర్షం కురిసింది. 47.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని గణాంకాధికారి తెలిపారు. మండల పరిధిలోని దువ్వూరు, గుడిపాడు. చిన్నసింగనపల్లె, గొల్లపల్లె, చల్లబసాయపల్లె, మదిరేపల్లె, నీలాపురం, దాసరిపల్లె,, చింతకుంట, మిర్జాకాన్ పల్లె, కానగూడూరు, జిల్లెల్ల, ఏకోపల్లె, ఎంకుపల్లె, పెద్ద జొన్నవరం, ఎర్రబల్లె, మురళీనగర్, గోపులాపురం, బుక్కాయపల్లె, ఇడమడక తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. 47.5 మీ. మీ వర్షపాతం నమోదైందని మండల గణాంకాధికారి గురువీర కుమార్ తెలిపారు. ప్రస్తుతం వర్షం కురవడం వల్ల చాలామంది రైతులు కేపీ ఉల్లి పంట, మినుము పంటలు సాగు చేశారు. ఈ వర్షం వల్ల మినుము ఉల్లి పంటలకు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పసుపు, వరి పంట రైతులు ఆనందం వ్యక్తం ఆనందంచేస్తున్నారు. మండలంలోని సోమవారం తెల్లవారుజామున 4 గంటలనుంచి వర్షం మొదలు అయింది. అయితే కొంత మంది రైతులపంటలకు నష్టం కాగా



రైతులు ఆందోళన చెందుతుండగా, మరో వైపు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడిందని ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నీలాపురం గ్రామంలో కొన్ని వీధులలో ఇళ్లల్లోకి నీరు చేరాయి. నీలాపురం గ్రామపంచాయతీలోని సుగాలి తండాకు వెళ్లాలంటే తెలుగు గంగ నీరు ప్రవాహం తో పాటు రాత్రి కురిసిన వర్షానికి వంక పూర్తిగా పారుతున్నందున ఆ దారి లో వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో 86 లక్షల రూపాయలతో సుగాలి తండాకు రోడ్డు వేస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఇంతవరకు రోడ్డు వేయకపోవడంతో సుగాలి తాండవాసులు చాలా ఇబ్బందులు గురవుతున్నారు. ఈ ప్రభుత్వం అయినా వెంటనే సుగాలి తండకు రోడ్లు వేయాలని కోరుతున్నారు.

# అంతా మా ఇష్టం -మేము చెప్పినట్లు వినాలి

### రైతులను బెదిరించిన సెక్రటరీ – వ్యాపారస్తులతో మార్కెట్ యార్డ్ సెక్రటరీ కుమ్మక్కు
### నష్టపోతున్నామని చీని రైతులుఆందోళన – రైతులకు న్యాయం చేస్తాం మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ యాదవ్

**పులివెందుల, మేజర్‌న్యూస్ :** ఈనామ్ పద్ధతి మాకొద్దు అంటూ చిని రైతులు ఆందోళన చేపట్టారు. స్థానిక మార్కెట్ యార్డులో సెక్రటరీ శ్రీధర్ రెడ్డి ఈనామ్ పద్ధతిలో చీనా కాయల వేలంపాట సోమవారం నిర్వహించారు. అయితే ఈ వేలం పాటలో చీనా కాయల ధర తక్కువగా పలుకుతుండడంతో ఇలా అయితే తాము నష్టపోతామని రైతులు వ్యాపారస్తులను, మార్కెట్ యార్డ్స్ సిబ్బందిని ప్రశ్నించారు. ఎప్పుడు లేని విధంగా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఈ నామ్ పద్ధతి ద్వారా ఎలా వేలంపాట నిర్వహిస్తారని ప్రశ్నించారు. దీంతో మార్కెట్ యార్డ్ సెక్రటరీకి రైతులకు ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. మార్కెట్ యార్డ్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి వ్యాపారస్తులతో కుమ్మక్కై తమకు అన్యాయం చేస్తున్నారని వారు ఆరోపించారు. తమకు ముందు పద్ధతిలోనే వేలం పాట నిర్వహించాలని భీష్మించుకుచున్నారు. వ్యాపారస్తులతో ఇప్పటికే చాలా వరకు నష్టపోయామని, ఇలా నష్టపరిచే బదులు కాస్త విషమిస్తే తాగి చచ్చిపోయేది మేలు అన్నారు. ఇదిలా ఉంటే వ్యవసాయ మార్కెట్ యార్డ్ సెక్రటరీ అంతా మా ఇష్టం మేము చెప్పినట్లే వినాలి మీరు చెప్పినట్లు వినం అంటూ చీనా రైతులను బెదిరించారు. దీంతో కొంచెం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కోపద్రికులైన రైతులు సెక్రటరీ కార్యాలయానికి తాళాలు వేశారు. ఈ విషయం తెలుసుకున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ యాదవ్, సీఐ సీతారామరెడ్డి లు రైతులను శాంతింప చేసి సంప్రదింపులు జరిపారు. ఈ నాం పద్ధతిలో వేలంపాట నిర్వహిస్తామని



తమకు ముందే సమాచారం ఇస్తే మార్కెట్ కు చీనా కాయాలను తీసుకొచ్చే వారం కాదని, వ్యాపారస్తులతో సెక్రెటరీ మాట్లాడుకుని తమకు నష్టం కలిగిస్తున్నారని చైర్మన్ అమర్నాథ్ కు రైతులు తెలిపారు.

**రైతులకు మేలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

మార్కెట్ యార్డులో రైతులు ఆందోళన చేపడుతున్నారని విషయం తెలుసుకున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ యాదవ్ ఆందోళన చేపడుతున్న రైతులకు న్యాయం చేస్తామని చెప్పి రైతులను శాంతింప చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతుకు అన్యాయం జరగకుండా న్యాయం జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో యధావిధిగా వేలంపాట నిర్వహించారు.

# చినుకు పడిందంటే ఆ ...ప్రాంతమంతా మురికి నీటిమయమే..!

### మునిసిపల్ అధికారులు ఎంత శ్రమించిన ఫలితం శూన్యం..
### గత ప్రభుత్వంలో లక్షలాది రూపాయలు వేచించి మురికి తొలగించినప్పటికీ నిరుపయోగంగా మారింది.
### ప్రధాన రహదారిపై నీరు నిల్వ ఉండదంతో పాదాచార్యులు వాహనదారులు తీవ్ర ఇక్కట్లు..

**బద్వేల్, మేజర్‌న్యూస్ :** బద్వేల్ పట్టణంలో కురిసిన భారీ వర్షంతో పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజ్ ప్రధాన రహదారి అయిన మైదుకూరులోని దాదాపుగా ఒక కిలోమీటర్ మేరకు మోకాళ్ళ లోతు వర్షపు నీటితో నిల్వ ఉండ డంతో ప్రజలు వాహనదారులు తీవ్ర ఇతరులకు గురయ్యారు. వివరాల్లోకెళితే బద్వేల్ పట్టణంలో వర్షంపడిందంటే ఆ ఏరియా అంత మోకాలలోతు మురికి నీళ్లతో నిండిపోవడంతో ఆ ప్రదేశాలలోని పాఠశాలలు వ్యాపార సంస్థలు బ్యాం కులు వద్దకు వెళ్లాలంటే ఖాతాదారులు గృహాల నివసించే వారి ప్రదేశాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు గతంలో వర్షాలు కురిసినప్పుడు ప్రధాన రహదారులన్నీ గుంతలమయం కావడంతో వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఆ దారిన వాహనదారుడు ప్రయాణించేటప్పుడు వాహనదా రులకు గోతులు పడిన ప్రదేశం కనిపించకపోవడంతో గోతులలా పడి వాహన దారులు అదుపుతప్పి పడిపోయే సంఘటనలు అధికంగా చోటు చేసుకున్నాయి. పట్టణంలో భారీ వర్షం కురిసిన వెంటనే స్పందించిన రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్, బద్వేల్ మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి బద్వేల్ గోపవరం మండల రెవెన్యూ అధికారులు ఉదయభాస్కర్ రాజు, రెడ్డి త్రి భువన్ రెడ్డి వర్షపు నీరు అధికంగా నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి సంఘటన స్థలానికి చేరుకొని మునిసిపల్ సిబ్బందిని అప్రమత్తం చేసి సచివాలయ సిబ్బంది చుట్టూ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తా చెదాలను తొలగించేం దుకు అధికారులు తీవ్రంగా కృషి చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో లక్షలాది రూపాయలు వేచింది మురికి కాలువలు లోని చెత్తా చెదారని తొలగించే దానికి లక్షలాది రూపాయలు వేచించిన నిరుపయోగమైనదని స్థానికులు విమర్శిస్తున్నారు. తొలగించేటప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తొలగించే కాంట్రాక్టర్ తన ఇష్టానుసారముగా తొలగించకుండా నిధులు నిర్వహించకుండా రాజేశ్వరి వెళ్లి పోవడంతో ఈ డ్రైనేజీ



సమస్య వల్ల మైదుకూరు రోడ్డులో వర్షం పడిందంటే మోకాళ్లలోతు నీటిలో ప్రయాణించాల్సిందేనని వాపోయారు. ప్రణాళిక బద్ధమైన డ్రైనేజీ నీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు. ఆర్టీసీ గ్యారేజ్ నందు నిలిచిన వర్షం నీటిని తక్షణమే తొలగించుటకు ఆర్టీసీ డిపో మేనేజర్ సమన్వయంతో చర్యలు చేపట్టడం ద్వారా ఆర్టీసీ గ్యారేజీలో నిల్వ ఉన్న మురిగినీరును తొలగించడం జరిగిందన్నారు. మునిసిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మురికి నీటిసమస్య తీవ్రత అధికంగా ఉన్నచోటికి వెంటనే చేరుకోవాలని సిబ్బందినీ ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది నిరంతరం శ్రమించి పలు ప్రదేశాల్లోని మురికి నీరు నిల్వ ఉన్న తొలగించారు మోకాళ్ళలోతు వరకు నీరు నిలవ అలాగే ఉండడంతో ప్రజలు వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రానున్నది వర్షాకాలం కాబట్టి మున్సిపల్ అధికారులు మురికి నీరు నిలువ లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆన్‌లైన్ పని భారాన్ని తగ్గించాలి

## ఏపీఎంకు డ్వాక్రా సంఘాలు వినతి



**పులివెందుల రూరల్, మేజర్‌న్యూస్:** పులివెందుల మండల సమైక్యలో పనిచేస్తున్న వివో ఏల పని భారాన్ని తగ్గించాలని సోమవారం పట్టణంలోని డిఆర్డిఏ కార్యాలయంలో ఏపీఎం గురురాజుకు డ్వాక్రా సంఘాల మహిళలు వినతిపత్రం సమర్పించారు.. కొత్తపల్లి, నల్లపురెడ్డిపల్లి ఎర్రబెల్లి, అచ్చువెల్లి, ఎర్రిపల్లి గ్రామాల్లో పనిచేస్తున్న వివోఏలు మాట్లాడుతూ వివో ఎలా సమస్యలపై గత కొంతకాలంగా ప్రభుత్వ అధికారులకు అనేకవైతం సమర్పించాం అన్నారు ఆయన సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఫైవ్ జి మొబైల్స్ ఇవ్వకుండా కిందిస్థాయిలో ఆన్లైన్ వర్కులు చేయలేదని వేధింపులు జరుగుతున్నాయి ఫైవ్‌జి మొబైల్స్ ఇచ్చేవరకు ఆన్లైన్లో వర్కులు చేయలేమని తేల్చి చెప్తున్నామన్నారు. మా న్యాయమైన డిమాండ్లు 5జి మొబైల్స్ సిమ్ కార్డు ఇవ్వాలి ఆన్లైన్లో పని భారాన్ని తగ్గించాలి మూడు సంవత్సరాల సర్కులర్ కాల పరమతి సర్కులర్ను రద్దు చేయాలి, ప్రతి నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలి, కనీస వేతనం చట్ట ప్రకారం పనికి తగ్గ వేతనాన్ని పెంచాలి, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి 10 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి బకాయి వేతనాలు చెల్లించాలి, విజయవాడ సమస్యలను ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.

# ఘనంగా సాయిబాబా విద్యాసంస్థలో “స్పెల్లోరేట్ సెలబ్రేషన్స్”





**కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక కార్పోరేటర్ యం.వి. శ్రీదేవి మట్లాడుతూ, ఈ రోజు విద్యావిధానంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని, అందులో భాగంగా విద్యార్థులలో విద్యనే కాకుండా అన్ని విభాగాలలో కూడా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినంద నీయమని తెలిపారు. అలాగే విద్యార్థులలో భాషా నైపుణ్యాలు, స్పెల్లింగ్ ప్రతిభను అభివృద్ధి చేయడం ఈ వేడుక యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అలాగే పిల్లలందరూ కూడా కష్టపడేటువంటి ధ్యేయముతో చదువు తోపాటు అన్ని రంగాలలో కూడా అభివృద్ధి చెందాలని తెలిపారు. తదనంతరం సాయిబాబా విద్యాసంస్థల వైస్ చైర్మన్ యం.వి. సాయిసుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులందరూ కూడా సత్ప్రవర్తన కలిగి ఉండి, పెద్దల యెడల భక్తి, గౌరవము మున్నగు మంచి లక్షణాలతో అభివృద్ధి చెంది, ఈ దేశ భవిష్యత్తుకు మంచి పునాదులు వేయాలని కోరారు. తదనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు “మెమోంటోలు మరియు సర్టిఫికేట్స్” అందజేశారు. తదనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకొన్నాయి ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ తల్లిదండ్రులు, విద్యార్థులు అనితా ఫ్లారెన్స్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# రిమ్స్‌లో పనిచేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ కార్మికులను తొలగిస్తే ఉద్యమిస్తాం

## రిమ్స్ కార్మికులకు ఉద్యోగ భద్రతను కల్పించాలి – ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి



కడప రిమ్స్, మేజర్‌న్యూస్: రిమ్స్ నందు నూతనంగా శానిటేషన్, సెక్యూరిటీ ఏజెన్సీ బాధ్యతలను చేపట్టనున్న ఓ ప్రైవేట్ సంస్థ ఇందులో పనిచేస్తున్న కార్మికులను తొలగించాలని చూస్తుందని, 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించటం కార్మిక చట్టా వ్యతిరేకమని, దానిని ఏమాత్రం ఆర్ సి పి సహించ బోదని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం రిమ్స్ నందు కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్ నందు పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్ట ప్రకారం వేతనాలు అందడం లేదని, అందులోను కూడా ఈఎస్ఐ, పిఎఫ్ లలో గోల్మాల్ జరుగుతున్నాయని, నెలనెలా వేతనాలు అందించడంలో తీవ్ర జాప్యం నెలకొంటుందని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కోరారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పడనికి గల కారణం! పనిలో నాణ్యతను కనబరిచి, కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేతనాలు నెలనెలా చెల్లించే బాధ్యతను కాంట్రాక్టర్ పై ఉంటుందని, అలాంటిదే కార్మికులను ఏమాత్రం పట్టించుకోకుండా కాంట్రాక్టర్లు మాత్రం కోట్లకు కోట్ల రూపాయలు సంపాదించుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని నెల నెల కార్మికుల నుంచి వేతనాలలో కట్ చేస్తున్న పీఎఫ్, ఈఎస్ఐ జమను కార్మికులందరికీ తెలియపరచాలని, కార్మికులకు ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు వచ్చిన రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ వారికి అండగా ఉంటుందని వారికోసం ఎంతటి త్యాగాలకైనా వెనకాడ బోదని అయన తెలిపారు.

# రోటరీ కంటి ఆసుపత్రిలో ఉచిత కంటి పరీక్షలు

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ సామాజిక సేవా సంస్థ రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు పట్టణం గాంధీ రోడ్డు లోని స్టేట్ బ్యాంక్ ప్రక్కన రోటరీ సర్వీస్ కాంప్లెక్స్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించబడే రోటరీ కంటి ఆసుపత్రి నందు లేటెస్ట్ మిషనరీ అధునాతనమైన ఆపరేషన్ థియేటర్ 20 మంది సిబ్బంది అనుభవజ్ఞులైన ఇద్దరు ఫ్యాకో సర్జన్స్ సేవల ద్వారా మధుమేహ( షుగర్) వ్యాధి గ్రస్తులకు మరియు 60 సంవత్సరముల వయస్సు పైబడిన వారందరికీ ప్రతి శుక్రవారం మరియు శనివారం మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు ఉచితంగా కంటి పరీక్షలు చేయబడును ప్రజలందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకొని మీ నేత్రాలను ఆరోగ్యంగా కాపాడుకోవాలని రోటరీ కంటి ఆసుపత్రి ప్రెసిడెంట్ కోటా శివకుమార్ సెక్రటరీ ఎంవిఎన్ ప్రభులు తెలియజేశారు సేవాభావంతో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాల్సిందిగా కోరారు. మరింత సమాచారం కోసం 08564 247012 మొబైల్ నెంబర్ 6303 448294 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# మానవతమే మతమని చాటిన “మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్” సభ్యులు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ నందు ఓబులేసు అనే అనారోగ్యం చేత మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి నాలుగు రోజులు గడిచినా బంధువులు ఎవరు రాకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్‌ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి సోమవారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అహమ్మద్ హుస్సేన్, కృప అగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు పాపిషెట్టి వెంకటాలక్షుమ్మ,సుమన్ బాబు, ప్రసన్న కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో జీఎస్టీ పై అవగాహన సదస్సు



**కడప ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** “సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్” అనే అంశంపై కామర్స్, ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథిగా తమిళనాడులోని తిరుచిలో జిఎస్టి ఇన్స్పెక్టర్‌గా పని చేస్తున్న లీలాధర్ గారు విచ్చేసి జీఎస్టీ గురించి జిఎస్టి యొక్క లాభనష్టాల గురించి ముఖ్యంగా విద్యారంగానికి నవతరం జీఎస్టీ సంస్కరణలు గురించి విద్యార్థులకు వర్తించే భారీ పన్ను తగ్గింపు గురించి, ఏ ఏ వస్తువుల మీద, పన్ను తగ్గింపు జరిగినది, పూర్తిగా పన్ను నుంచి ఉపశమనం పొందిన వస్తు సేవలు వివరాల గురించి వాటి వల్ల విద్యార్థులకు ఎంత డబ్బు పొదుపు జరుగుతోంది తదితర వివరాల గురించి చక్కగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగినది. ప్రభుత్వము ప్రజల సంక్షేమం కోసం ముఖ్యంగా విద్యా వైద్యం రంగంలో పన్ను సంస్కరణలో భారీ మార్పులను తీసుకురావడం జరిగింది. విద్యారంగానికి సంబంధించి గతంలో బుక్స్, ఇతర స్టేషన రీ అంశాలపై 12 శాతం జీఎస్టీ ఉండగా ప్రస్తుతము పూర్తిగా పని నుంచి మినహాయింపును ఇవ్వడం జరిగింది. డ్రాయింగ్ మరియు ఆర్ట్ మెటీరియల్ సంబంధించిన అంశాలపై గతంలో 18 శాతం పన్ను విధించగా ప్రస్తుతం ఐదు శాతానికి తగ్గించడం జరిగినది. జామెట్రీ ,మ్యాథమెటికల్ తదితర అంశాలపై గతంలో 12% పన్ను విధిస్తుండగా ప్రస్తుతము ఐదు శాతానికి తగ్గించడం వల్ల విద్యార్థులకు ఏడు శాతం కొరకు పొదుపు జరుగుతోందన్నారు. ముఖ్య వక్తగా వచ్చిన జీఎస్టీ ఇన్స్పెక్టర్ లీలాధర్ జీఎస్టీ పై అవగాహనతో పాటు కెరీర్ గైడెన్స్ కూడా విద్యార్థులకు అందించి ప్రతి విద్యార్థి తమ డిగ్రీ అనంతరము ఏ విధంగా ఉద్యోగాన్ని సంపాదించుకోవాలి, ప్రస్తుత పోటీ ప్రపంచంలో పోటీని తట్టుకొని విషయం పొందాలంటే ఎలాంటి ప్రణాళిక, ప్రిపరేషన్ ఉండాల అన్న అంశంపై వివిధ రకాల అంశాలను విద్యార్థులకు చక్కగా వివరించడం జరిగింది. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో, నిబద్ధతతో, చక్కటి ప్రణాళికతో, సాధించాలన్న తపనతో పోటీ పరీక్షలకు సన్నద్ధమైనట్లయితే తప్పకుండా విజయం పొందుతారని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మరో అతిథిగా విచ్చేసిన శ్రీనివాస ప్రసాద్ గారు మాట్లాడుతూ చక్కటి ప్రణాళికతో విద్యను అభశించినట్లయితే, మంచి ఆలోచనలతో, సన్మార్గంలో నడుచుకుంటూ విద్యను అభ్యసించినట్లయితే ఉన్నత విజయాలు సాధిస్తారని తెలియజేశారు.

# ఎగ్జిబిషన్ టికెట్ల పెంపు బాధ్యత ఎమ్మెల్యే వరదదే

## మున్సిపల్ వైస్ చైర్మెన్ పాతకోట బంగారు మునిరెడ్డి



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** ఎగ్జిబిషన్ టికెట్ల పెంపు బాధ్యత ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి దే అని మున్సిపల్ వైస్ చైర్మెన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపల్ గెజిట్ ప్రకారం ఎగ్జిబిషన్ టికెట్ పెద్దలకు రూ.35, పిల్లలకు రూ20లు వుండగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు దసరా పర్వదినం రోజు పెద్దలకు 100, పిల్లలకు 80 రూపాయలు, మరుసటి రోజు నుంచి పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.50లతో విక్రయిస్తున్నారని వివరించారు. ఈ విషయమై తాము కమిషనర్‌ను సంప్రదించినా చర్యలు శూన్యమన్నారు. అదేవిధంగా ప్రభుత్వాధికారులు అవినీతి చేయరాదని ప్రమాణాలు చేయించే ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కూడా ఆయన శిష్యులైన ఈ ఎగ్జిబిషన్ నిర్వాహకులను కట్టడి చేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గత సంవత్సరం ఆయన శిష్యుడైన ఎగ్జిబిషన్ నిర్వాహకుడు మున్సిపాలిటీకి దాదాపు రూ.36 లక్షలు ఎగనామం పెట్టారని, కనీసం ఈ సంవత్సరమైనా మున్సిపాలిటీకి రావాల్సిన రూ. 2.25 కోట్లు మున్సిపాలిటీకి వచ్చేలా చూడాలని తెలిపారు. టిడిపి మాజీ ఇంచార్జ ప్రవీణ్ కుమార్ రెడ్డి దీనిపై స్పందించకపోవడమేమిటని ప్రశ్నించారు. ఇటీవల మైదుకూరు రోడ్డు విస్తరణ నిర్వహించారని, ఇంతలోనే రాత్రి పడిన వర్షానికి ఉదయం 11 గంటల ప్రాంతంలో కూడా రిలయన్స్ పెట్రోల్ బంక్ జలమయమైన విషయం గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్

## శ్రీ సాయి హెచ్.పీ గ్యాస్ కనెక్షన్ ఏజెన్సీ

పులివెందుల, మేజర్‌న్యూస్ : పులివెందుల పట్టణ పరిధిలోని నారాయణ స్కూల్ సమీపంలో ఉన్నటువంటి శ్రీ సాయి హెచ్.పీ గ్యాస్ కనెక్షన్ ఏజెన్సీలో ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందని గ్యాస్ ఏజెన్సీ వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించినటువంటి రేషన్ కార్డు కలిగి ఉండి అందులో ఏ ఒక్కరికి గ్యాస్ కనెక్షన్ లేనిచో, ఆ రేషన్ కార్డులో ఉండే మహిళలకు ఉచిత గ్యాస్ కలెక్షన్స్ ఇవ్వడం జరుగుతుందని ఈ పథకం మహిళలకు మాత్రమే వర్తిస్తుందని, అందుకు కావలసిన డాక్యుమెంట్స్ తెలియజేస్తూ, రేషన్ కార్డు, రేషన్ కార్డులో ఉండే పెద్దల ఆధార్ కార్డులు, మహిళ బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, మహిళ పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు మూడు, ఎస్సీ ఎస్టీ అయితే క్యాస్ట్ సర్టిఫికెట్, వీటన్నిటిని తీసుకొని శ్రీ సాయి హెచ్ పి గ్యాస్ ఆఫీస్ వద్దకు వచ్చి అందించవలెనని ఈ అవకాశాన్ని పులివెందుల నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు తెలిపిన ఫోన్ నెంబర్ 9000980887,9000980885,9000980884, సంప్రదించగలరని తెలిపారు.

## అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

### ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం డిమాండ్



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘాన్ని మరియు ఆ సంఘ సభ్యులైన చెక్క భజన గురువులు కందుల రవి కుమార్, గుడిమే సుదర్శన్, తలారి నరసింహులుపై సోషియల్ మీడియాలో అనుచిత పదజాలంతో దుర్భాసలాడిన బ్రహ్మంగారి మఠంకు చెందిన చిన్నపాటి కోలాటం గురువు చందుపై తగు చర్యలు తీసుకోవాలని పోరుమామిళ్ళ సర్కిల్ ఇన్స్పెక్టర్ కు పిర్యాదు చేశారు. చందు అనే కోలాటం గురువు తమ వ్యక్తిగత మరియు తమ సంఘం యొక్క ప్రతిష్టను దిగజార్చే విధంగా ఫేక్ సంస్థ అని సోషియల్ మీడియాలో పోస్ట్ చేశారని అతనిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు కందుల రవి కుమార్, ఉపాధ్యక్షులు గుడిమె సుదర్శన్, తలారి నరసింహులు తెలిపారు. కావున అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకొని మాకున్యాయం చేయాలని వారు కోరారు. రాబోయే కాలంలో మాకు ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని విధాల అతనిపై కఠిన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని విన్నవించారు.

## కోమన్నుతల కిరణ్ రెడ్డి కుటుంబానికి బిటెక్ రవి పరామర్శ



**లింగాల, మేజర్‌న్యూస్ :** లింగాల మండలంలో ని కోమన్నుతల గ్రామానికి చెందిన కిరణ్ కుమార్ రెడ్డి ఇటీవలే అనారోగ్య కారణాలతో మృతి చెందిన. కుటుంబాన్ని పరామర్శించిన పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి వారి గృహానికి వెళ్లి కిరణ్ రెడ్డికి నివాళులర్పించి వారి తండ్రి లక్ష్మీనారాయణరెడ్డి ,తమ్ముడు నవీన్ రెడ్డి,ని మరియు వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల కన్వీనర్ టీడీపీ యమ్మనూరి విశ్వనాథరెడ్డి, లింగాల టిడిపి సీనియర్ నాయకులు, దేవిరెడ్డి సంజీవ రెడ్డి, అజ్జుగుట్టు రఘునాథ రెడ్డి, కిరణ్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించడం జరిగింది.

## గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

### గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి శివశంకర్



**కడప టౌన్, మేజర్‌న్యూస్:** జిల్లా వ్యాప్తంగా గిరిజనులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని,వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి సొరకాయల శివశంకర్ కోరారు. సోమవారం కలెక్ట రేట్‌లో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా గిరిజనులు అన్ని విధాల వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర ప్రణాళికతో వారి అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ,ఎస్టీ బ్యాక్ లాక్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఎస్టీ బోగస్ సర్టిఫికెట్ పొంది ఉద్యోగం చేస్తున్న వారిపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా ప్రతి నెల ఎస్సీ,ఎస్టీ ప్రజా వేదిక ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఎస్టీ బోగస్ సర్టిఫికెట్స్ పైన వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.స్పందించిన జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తగు చర్యలు తీసుకుంటామని ఆయనకు తెలిపారు.

# స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్య ఆంధ్రప్రదేశ్ నిర్మిద్దాం

### ఈనెల16 కడపలో జరుగు రాయలసీమ సదస్సును జయప్రదం చేయండి..

### సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు




**కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** డిసెంబర్ 6,7 తేదీల్లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర 9వ మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 16వ తేదీన రాయలసీమ ఎనిమిది జిల్లాలతో కూడిన సమావేశం స్థానిక ప్రెస్ క్లబ్ లో జరుగుతుందని, ఈ సమావేశానికి పొలిట్ బ్యూరో సభ్యులు రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ హాజరవుతున్నారని ఈ సమావేశాన్ని జయప్రదం చెయ్యాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి. బి. బంగార్రావు, జిల్లా కార్యదర్శి ఓబయ్య లు పిలుపు నిచ్చారు. సోమవారం ఈ సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలందరికి ఖాతాలో 15 లక్షల రూపాయిలు నల్లధనం తెచ్చి జమ చేస్తానని, సంవత్సరానికి రెండు. కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని యువతకు ఆశలు రేపి, బేటీ బచావో బేటీ పడావో అని మహిళలను ఆకర్షించి, ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు అనే అధికారంలోకి వచ్చిన బిజేపీ ప్రభుత్వం ఇచ్చిన నాగ్దానాలన్నీ బూటకం అని రుజువైనాయి. దేశంలో నిరుద్యోగం రాజ్యమేలుతోంది. దీని ప్రజా వ్యతిరేక విధానాల వలనే ప్రజలకి ఉపాధి కరువవుతుంది. దేశంలో గత 70 సం?లుగా ప్రజలు కష్టపడి చేసుకోద్ది పైసా పైసా కూడబెట్టి సంపాదించిన ఆస్తులు, స్టీల్ ప్లాంట్లు, ఓడరేవులు, విమానాశ్రయాలు, విమానాలు, రైల్వేలు, హైవేలు, బొగ్గుగనులు కలా ఒకటేమిటి సర్వసంపదలు కోటీశ్వరులకు తేరగా కట్టబెడు తున్నారు. అదిదాలక మనలను తాకట్టు పెట్టి మోడీ ప్రభుత్వం 83 లక్షలకోట్ల రూపాయిల అప్పుచేసి పాలనసాగిస్తున్నారు. ఎక్కడా పరిశ్రమలు. ప్రాజెక్టు నిర్మించి ఉద్యోగాలు కల్పించే నిర్మాణాత్మక పనులు చేపట్టలేదు.సుదీర్ఘకాలం జరిగిన స్వాతంత్ర పోరాటం వలన మనకు లభించిన రాజ్యాంగాన్ని విధ్వంసం చేసి దాని స్థానంలో మనుస్మృతిని రాజ్యాంగంగా తేవాలని సన్నాహాలు చేస్తున్నారు. ఈ రాజ్యాంగం పౌరులందరికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని కలిగిస్తే మనుస్మృతి మనుషుల మధ్య మానవీయ సంబంధాలను నిరాకరిస్తుంది..మనది ప్రధానంగా వ్యవసాయ దేశం ఇప్పటికి జనాభాలో నూటికి అరవై మందికి ఉపాధి ఇసున్న వ్యవసాయ ఉపకరణాలను రైతుకు అందుబాటులో రేవగానికి బదులు ముత్తం వ్యవసాయాన్ని కార్పోరేట్లయిన వ్యంగం ఇది. అటువంటి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి బదులు పంటలకు మద్దతు ధరలను, ఆదాని, అంబానీలకు కట్టబెట్టడానికి కేంద్రప్రభుత్వం తలపెట్టింది. దీనికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం వెయ్యి మంది ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన రైతాంగాన్ని అనేకవిధాల హింసలకు గురిచేసి చివరకు రైతు ఉద్యమ తాకిడికి తట్టుకోలేక మూడు నల్ల వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్నది. మద్దతు ధరకు చట్టబద్దత కల్పిస్తామని మాట ఇచ్చింది. అమెరికా నుండి దిగుమతి అయ్యే కాటన్ వస్తువుల మీద ఉన్న పన్నులను రద్దు చేసింది. సామ్రాజ్యవాదం మనం ఎగుమతి చేసిన సరుకులకు నూటికి 50 రూ?ల పన్ను విధించిన నోరు మెదపక మిన్నకున్నది. ఫలితంగా భారతదేశంలో పత్తి పండించిన రైతులకు అలాగే ఇక్కడ ఆక్వా రైతులకు అది శాపంగా తయారయ్యింది.నేడు రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిలో వృద్దులకు ఇచ్చిన పెన్షన్ తప్ప మిగతా సమస్యలన్నీ కీలకమైనవి ఏవి అమలు చేయలేదు. ఉదహారణకు 20 లక్షల ఉద్యోగాలు లేదా 3000 రూపాయిలు నిరుద్యోగభృతి, రైతుకు మద్దతుగా అన్నదాతకు 20 వేల రూపాయల మద్దతు. అలాగే మూడుసెంట్లు ఇళ్ల స్థలం ఇవేవి అమలు జరగడం లేదు.ఉద్యోగాలు కల్పిస్తానన్న టిడిపి మాట అటుంచి ఉన్న ఉద్యోగాలను కూడా వీకే స్టీల్ ప్లాంట్లు అమ్మి వేస్తుంటే కళ్ళప్పగించి చూస్తున్నాయి. అధికార ప్రతిపక్ష పార్టీలైన టిడిపి వైయస్సార్ పార్టీలు రాష్ట్రాన్ని అప్పులు పాలు చేయడంలో ఒకరిని మించి ఒకరు పోటీ పడి ప్రజలను ముంచుతున్నారు. ప్రజల మీద మమకారం కాదు. కాని అధికారదాహం ఏ సంక్షేమ పథకాలు నిండా ఉన్నాయి. ఇవన్నీ కూడా ప్రజల మీద పన్నుల భారంమోపి తడిసి మోపుడు చేస్తున్నాయి.

# క్రైస్తవ ప్రార్థన మందిరాలపై-క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

### యునైటెడ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఇండియా కమిటీ



**పులివెందుల, మేజర్‌న్యూస్:** క్రైస్తవులు, క్రైస్తవ ప్రార్థన మందిరాలపై, ఆస్తులపై జరుగుతున్న దాడులను ఖండించాలని యునైటెడ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఇండియా కమిటీ సభ్యులు అన్నారు. సోమవారం పులివెందుల పట్టణంలోని కెపి ఫౌండేషన్ కార్యాలయంలో యునైటెడ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ కమిటీ ఇండియా కమిటీ సభ్యులు మాట్లాడుతూక్రైస్తవులపై, క్రైస్తవ ప్రార్థన మందిరాలపై ఆస్తులపై జరుగుతున్న దాడుల విషయమై వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ క్రైస్తవులకు చట్టబద్ధంగా రక్షణ కల్పించాలని వారన్నారు. దాడి చేసే వారి మీద చట్టబద్ధంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. అనంతరం యుసిపిసిఐ కమిటీ వారు కడప జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు.జిల్లా అధ్యక్షుడిగా షద్రక్‌ని, కమిటీ సభ్యులుగా, శ్రీనును జాన్,అభినెజర్, విజయ్, డేవిడ్‌లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అధ్యక్షులుగా దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ అధ్యక్షత వహించిఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులపై అలాగే దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, దాడి చేసిన వారు ఎంతటి వారైనా కఠినంగా చట్టబద్ధంగా శిక్షించాలన్నారు. క్రైస్తవం అంటే శాంతి సందేశం అందించేదే తప్ప, క్రైస్తవ్యం కులము కాదు మతం కాదు అని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎవరో కొంతమంది అవగాహన లేని వ్యక్తులు కులాల మధ్య చిచ్చుపెట్టాలని కుల ఘర్షణలను రెచ్చగొడుతున్నారుతప్ప క్రైస్తవులు ఏ ఒక్కరికి వ్యతిరేకం కాదని ప్రతి ఒక్కరికి ప్రేమ ఆప్యాయత దయ కరుణను చూపించేవారు అన్నారు. క్రైస్తవులు. ఇకనైనా క్రైస్తవుల మీద జరిగే దాడులను అరికట్టాలని క్రైస్తవుల మీద దాడి చేసేవారు ఎంతటి వారైనా చట్టం ముందు దోషులుగా నిలబెడతామని ఈ సందర్భంగా దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కోలా ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో కోలా ప్రకాశం , పులివెందుల పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రశాంత్ కృపా రాజు, కిరణ్, దేవరాజు, అశోక్, క్రాంతి, డేవిడ్ రాజు, మాస్టర్ మణి, ప్రకాష్ అజర్, రాయచోటి ప్రాంతం నుండి విజయ కుమార్, పాల్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ లేని సమాజమే లక్ష్యం



**కడప క్రైమ్, మేజర్‌న్యూస్:** కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, ఆదేశాల మేరకు కడప జిల్లా, కడప తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో గల ఎస్ వి ఇంజనీరింగ్ కళాశాల, యందు, సోమవారం పోలీసు కళా జాతా, శక్తి టీమ్, నార్కోటిక్ టీమ్, ఈగల్ సెల్ సంయుక్తంగా విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ తమ పాత్ర పోషించాలని అధికారులు విద్యార్థిని విద్యార్థులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 'ఈగల్' పేరుతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వారికి తెలిపారు. తల్లిదండ్రులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింక్‌లు క్లిక్ చేయవద్దని, అలాగే ఓటిపి, పాన్ కార్డు వివరాలు ఇతరులకు చెప్పవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుదర్శన్ రెడ్డి , తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగతులసి ప్రసాద్, సిబ్బంది, ఫ్యాక్షన్ జోన్ ఎస్సై, కళా జాతా ఇంచార్జ్ సుబ్రహ్మణ్యం, శక్తి టీం సిబ్బంది,, ఈగల్ బృందం సభ్యులు అయూబ్ ఖాన్, గురు శేఖర్‌లు పాల్గొన్నారు.

# మరుగున పడ్డ స్వాతంత్ర్య సమరవీరుడు వడ్డెర ఓబన్న

## చిత్రపటానికి ఘన నివాళులు



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** బ్రిటిష్‌కి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించి, తగిన గుర్తింపురాని మరుగును పడ్డ స్వాతంత్ర సమరవీరుల్లో వడ్డెర ఓబన్న ప్రము ఖుడని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర అన్నారు. సోమవారం చరిత్ర, తెలుగు శాఖల ఆధ్వర్యంలో వడ్డెర ఓబన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రముఖ చరిత్రకారుడు డా. బాలగొండ గంగాధర్, వడ్డెర ఓబన్న కృషిని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 30 ఏళ్ల వయసులోనే ప్రాణాలర్పించిన సమరయోధుడని తెలిపారు. చరిత్రలో ఆయన గురించి చర్చించక పోవడం దారుణమన్నారు. ఉయ్యాల వాడ నరసింహారెడ్డి సఫలమయ్యేందుకు ఆయనే కారణమన్నారు. వీరిని చరిత్ర ఎన్నటికీ మరువకూడదని, తిరిగి చరిత్రలో ముఖ్యమైన వ్యక్తులుగా చేర్చాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.నాగ లక్ష్మిదేవి, మాధవరావు, కళాశాల పీడీ తేజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వడ్డె ఓబన్న వర్ధంతి వేడుకలు



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణంలోని అంబక పల్లె రోడ్డు సమీపంలో ఉన్న స్థానిక శ్రీశ్రీ కేఫ్ నందు భారత స్వాతంత్ర సమరయోధులు శ్రీ వడ్డే ఓబన్న వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ హాజరై వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర సంగ్రామంలో బ్రిటిష్ వారిని ఎదిరించి గెరిల్ల యుద్ధ తంత్రంతో బ్రిటిష్ సైన్యాలను గడగడలాడించిన వీరుడని కొనియాడారు. ఆనాటి సమాజ గమనం లో ఎన్నో విజయాలను అందించి అసువులు బాపిన అయన చిర స్మరణీయలు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పులివెందుల వడ్డెర సంక్షేమ సంఘం సభ్యులు వెంకటరమణ వెంకటస్వామి, ప్రశాంత్, లోకేష్, అమర్, మోహన్, శివరాజ్ ,తదితరులు పాల్గొన్నారు.

# 21న శివాలపల్లి వీరభద్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నవ(9) కుండియ గాయత్రి మహా యజ్ఞలు

చెన్నూరు మేజర్‌న్యూస్: మండలంలోని శివాలపల్లి జింకల వంక ప్రక్కన వెలసిన శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి(ఉరుకుంద వీరన్న స్వామి) దేవాలయం వద్ద ఈనెల 21 తేదీన అమావాస్య మంగళవారం ఉదయం 9 గంటల నుంచి నవ(9) కుండియ గాయత్రి మహా యజ్ఞలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పొట్టి పాటి ప్రతాప్ రెడ్డి తెలిపారు.ఈ మహా యజ్ఞంలో పాల్గొనదల్చినవారు దంపతులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి హాజరుకావాలని కోరారు. గాయత్రి మహా యజ్ఞాలు నందు పాల్గొనదల్చినవారు ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలు లోపల భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. తమ పేర్లను 9491777800 నెంబర్ కు సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ మహా యజ్ఞాలకు హాజరయ్యే భక్తులకు ఆలయాన్ని సందర్శించే భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు.కావున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# డికెటి భూములను లబ్ధిదారులకు అప్పగించాలి - జిల్లా కలెక్టర్‌ను కోరిన ఎస్సీ మైనారిటీలు




**చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్:** కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం లోని ఇప్పపెంట పంచాయతీ పరిధిలో ఉన్న కాంపల్లె మరియు ఇప్పపెంట గ్రామాల్లో ప్రభుత్వం 1999లో సర్వే నం. 274 కింద దళితులు మరియు మైనారిటీలకు 28 ఎకరాల డికెటి భూమిని అప్పగించింది. ఒక్కొక్కరికి 0.75 సెంట్ల చొప్పున డికెటి పట్టాలు జారీ చేసినప్పటికీ, ఆ భూములు ఇప్పటికీ అగ్ర కుల కబ్జాదారుల చేతిలో ఉండిపోవడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని. లబ్ధి దారులు తమ భూములను స్వేచ్ఛగా సాగు చేసుకునే అవకాశం లేకుండా, రెవెన్యూ అధికారులు ఇప్పటికీ భూముల హద్దులు నిర్ణయించకపోవడం వల్ల అసలు వారి హక్కులు అమలవడంలేదు. అగ్రకులాల వారు బెదిరింపులకు దిగుతూ భూములను స్వాధీనం చేసుకుని పంటలు సాగుచేస్తున్నారు. ఈ పరి స్థితుల్లో లబ్ధిదారులు తమ భూముల వద్దకు కూడా వెళ్లలేని స్థితిలో ఉన్నారు. భూములు మంజూరైన తరువాత కేవలం పట్టాలు మాత్రమే ఇచ్చారు కానీ భూమి విభజన జరగలేదు. ఈ నేపథ్యంలో దళిత నేత జగన్ తహశీల్దార్ ఆఫీసు చుట్టూ తిరుగుతూ, లబ్ధిదారుల పట్టాలు సేకరిస్తూ, అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో అనుకోని ప్రమాదవశాత్తు మరణించారు. ఆ తరువాత లబ్ధిదారులు ఆధారాల లేక పోవడం వల్ల తగిన స్థాయిలో పోరాటం చేయలేక పోయారు. ఈ లోటును ఆసరాగా తీసుకున్న కొంతమంది అగ్రకులాల వారు అప్పటి అధికారులతో చేతులు కలిపి, మిలిటరీ పట్టాల ముసుగులో కొన్ని భూములను తమ పేర్లపై ఆన్లైన్‌లో ఎక్కించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాల్లో అప్పటి తహశీల్దార్ బీ. మహేశ్వర్ రెడ్డి, ఇతర రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు పాలుపంచుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. చిట్టిబోయిన వెంకటసుబ్బయ్య అనే వ్యక్తికి 4 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆన్లైన్ చేయడం వల్ల బీ. మహేశ్వర్ రెడ్డి సస్పెండ్ అయినట్టు గుర్తు చేశారు.లబ్ధిదారులు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఈ వ్యవహారాన్ని విచారించి, చట్టపరమైన చర్యలు తీసుకుని అక్రమంగా ఆన్లైన్ చేసిన భూమిని రద్దు చేసి, అసలు లబ్ధిదారులైన ఎస్సీ, మైనారిటీలకు తిరిగి అప్పగించాలనీ విజ్ఞప్తి చేశారు. చింతకొమ్మదిన్నె తహశీల్దార్ నాగేశ్వరరావు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని న్యాయం చేయాలని వివిధ ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎదురూరు బాబు - రాష్ట్ర అధికార ప్రతినిధి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, ఆర్.ఎన్. రాజా - జెఏసి చైర్మన్,కొల్లపాటి మతయ్య - వైఎంసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పి. రెడ్డెయ్య - ప్రధాన కార్యదర్శి,కె. సుబ్బరాయుడు - పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి, గోపి - పీఎస్‌యూ నాయకుడు, చిన్న సుబ్బయ్య - విహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షుడు, డి. మాతయ్య - విహెచ్‌పి జిల్లా అధ్యక్షుడు, డిఎం. ఒబులేసు - ఆర్ఎస్‌యూ జగన్ నాయక్ - బంజారా నాయకుడు పాల్గొన్నారు.

## సీఎం చేతులు మీదుగా ఆదర్శ గ్రామ పంచాయతీ

# అవార్డు అందుకున్న అధికారులు

## అధికారులను ప్రశంసించిన సీఎం చంద్రబాబు,మంత్రులు



**చెన్నూరు మేజర్‌న్యూస్:** గ్రామ పరిపశుభ్రతలో జిల్లాలోనే ప్రథమ శ్రేణిలో ఉందని చెన్నూరు గ్రామానికి ఆదర్శ గ్రామ పంచాయతీగా గుర్తించిన ప్రభుత్వం సోమవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పురపాలక పట్టణ అభివృద్ధి శాఖమంత్రి నారాయణ చేతుల మీదుగా జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి,డిప్యూటీ ఎంపీడీవో సురేష్ బాబు, పంచాయతీ సెక్రెటరీ బి.రామసుబ్బారెడ్డిలు అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా డిపిఓ రాజ్యలక్ష్మి, అధికారులు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, పరస్పర సహకారంతో పాటు పారిశుధ్య కార్మికుల నిర్విరామ కృషి,పట్టుదల వల్లే చెన్నూరు గ్రామం పరిశుభ్ర గ్రామ ఆదర్శ గ్రామపంచాయతీ అవార్డు అందుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు.ఆదర్శ పంచాయతీ లక్ష్యంతో లక్ష్యం పనిచేయడంతో లక్ష్యాన్ని చేరుకోగలిగామన్నారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో అధికారులు ప్రజాప్రతినిధులు సహకరించి వచ్చే విడతలో మరిన్ని గ్రామాలు ఈ అవార్డును పొందేందుకు కృషి చేయాలన్నారు.ఈ అవార్డు అందుకున్న సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్ఫూర్తి మరువలేనిదన్నారు. గ్రామ అధికారులే పరిశుభ్ర ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు పూర్తి స్థాయిలో సహకరించడం,బాధ్యతయుతంగా ప్రవర్తించి ఈ ఆదర్శ పరిశుభ్ర అవార్డును అందుకోవడం మరిన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారని వివరించారు.కృషి పట్టుదల ఉంటే ఏ పని అయినా సాధించవచ్చునని అందుకు ఈ ఆరు జిల్లాల నుంచి 6 గ్రామాలకు ఇచ్చిన అవార్డులే నిదర్శనంగా నిలిచాయని సీఎం అన్నారని వివరించారు. ఇందులో కడప జిల్లా నుంచి చెన్నూరు గ్రామం ఎంపిక కావడం సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సర్వత్ర హర్షించదగ్గ విషయమన్నారు.అవార్డు ప్రధాన కార్యక్రమంలో మంత్రి నారాయణ,స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ లిపట్టాభిరామ,కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమా,పంచాయతి రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పాల్గొన్నారుని దర్శనంగా నిలిచాయని వివరించారు ఇందులో కడప జిల్లా నుంచి చెన్నూరు గ్రామం ఎంపిక కావడం సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సర్వత్ర హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక పట్టణ అభివృద్ధి సంస్థమంత్రిపి. నారాయణ, స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ, కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ,పంచాయతి రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీకోన శశిధర్,తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ రమేష్‌కు స్వచ్ఛ్ ఆంధ్ర పురస్కారం



**కడప క్రైమ్ మేజర్‌న్యూస్ :** కడప నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ రమేష్ స్వచ్ఛంద్ర పురస్కారాన్ని సోమవారం కలెక్టరేట్లోని సభా భవనంలో జిల్లా కలెక్టర్ చేకూరి శ్రీధర్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు అందుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ చేతుల మీద అందుకోవడం చాలా గర్వంగా ఉందని పేర్కొన్నారు. స్వచంద్ర కార్యక్రమంలో కడప జిల్లాలో నగరపాలక సంస్థ మొదటి స్థానంలో రావడానికి కారకులైన కమిషనర్ మనోజ్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రం కృషి వల్ల ఈ రోజు ఈ పురస్కారం వచ్చిందని తెలిపారు. రాబోయే రోజుల్లో నగరపాలక సంస్థ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండే విధంగా తన వంతు శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. .కడప నగర పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి శానిటేషన్ మెరుగుపడేందుకు చర్యలుతీసుకుంటానని తెలిపారు.